
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
గురువారం 24 అక్టోబరు 2024



- గంజాయి మత్తులో రైలుకింద పడి ఇద్దరు యువకుల మృతి
- గంజాయి, మద్యం, మత్తు మాత్రలకు యువత బానిస
- చాప కింద నీరులా పాకుతున్న విషసంస్కృతి
- ఇంజనీరింగ్, ఇంటర్, హైస్కూల్ విద్యార్థులే టార్గెట్
- ఇద్దరు యువకుల మృతితో గంజాయి వ్యవహారం వెలుగులోకి
- తలలు పట్టుకుంటున్న తల్లిదండ్రులు
- సీరియస్‌గా తీసుకున్న ఎమ్మెల్యే నల్లారి



పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న కిరణ్ మృతదేహం



సంఘటనా స్థలంలో పడి ఉన్న యాసీన్ అలీ మృతదేహం



మత్తు.. యువత చిత్తు..



పీలేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గంజాయి సేవిస్తూ ఇద్దరు యువకులు రైలు కింద పడి ప్రాణాలు కోల్పోయిన సంఘటన బుధవారం పీలేరులోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇంతకాలం పెద్ద పెద్ద పట్టణాలకే పరిమితం అనుకుంటున్న గంజాయి వ్యవహారం గ్రామీణ నేపథ్యం ఉన్న పీలేరులోనూ వెలుగు చూడడం కలకలం రేపుతోంది. కుర్రాళ్లు గంజాయి, మద్యం, మత్తు మాత్రలకు బానిసలుగా మారిపోయి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న వైనాన్ని కళ్ల ముందు నిలిపింది. పీలేరు పట్టణం పద్మావతీనగర్‌కు చెందిన ఎస్.షరాఫత్ అలీ కుమారుడు ఎస్.యాసీన్ అలీ (17), ఆర్టీసీ నల్లగుట్టకు చెందిన కె.శ్రీనివాసులు కుమారుడు కె.కిరణ్ కుమార్(20)లు మంగళవారం రాత్రి గంజాయి సేవిస్తూ రైలు కింద పడి దుర్మరణం పాలైన సంఘటన పీలేరు ప్రాంతంలో గంజాయి అమ్మకాలకు సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ సంఘటనతో అటు ప్రజాప్రతినిధులు, ఇటు పోలీసు అధికారులు నిద్ర మేల్కొన్నారు.

విద్యార్థులే టార్గెట్‌గా...

దినదినాభివృద్ధి చెందుతున్న పీలేరు పట్టణంలో అనేక విద్యాసంస్థలు నడుస్తున్నాయి. కేజీ నుంచి పీజీ వరకు అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేటు కళాశాలలు సేవలందిస్తున్నాయి. పీలేరు పట్టణంలో ఉన్న ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులే లక్ష్యంగా చాలా మంది ఏజెంట్లు గంజాయి అమ్మకాలు సాగిస్తున్నట్లు సమాచారం. తిరుపతి, నెల్లూరు, బెంగళూరు, చిత్తూరు జిల్లా సదుం, పుంగనూరు ప్రాంతాల నుంచి గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో పీలేరుకు చేర్చి తమకు నమ్మకంగా ఉన్న వారి ద్వారా విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మద్యం లాగా ఎక్కువగా వాసన రాకపోవడం, కొనుగోలు చేసేందుకు పెద్దమొత్తంలో నగదు అవసరం లేకుండాపోవడం, ఎక్కడైనా ఏకాంత ప్రదేశాల్లో సేవించే అవకాశం ఉండడం, ఇద్దరు ముగ్గురు కలిసి కొనుగోలు చేసుకునేందుకు వీలుగా ఉండడంతో యువకులు గంజాయివైపు ఆకర్షితులవుతున్నట్లు తెలుస్తోంది. కేవలం గంజాయి మాత్రమే కాకుండా మత్తు కలిగించే మాత్రలు, ఎరేజింగ్ లిక్విడ్లు, కొన్ని ఇంజెక్షన్లకు కూడా యువకులు బానిసలుగా మారుతున్నట్లు తెలుస్తోంది.

అన్ని వేళ్లూ కలికిరి వైపు

పీలేరు పట్టణానికి గంజాయి, మత్తు మాత్రలు పొరుగునే ఉన్న కలికిరి నుంచి సరఫరా అవుతున్నట్లు అందరూ అనుమానిస్తున్నారు. రైలు ప్రమాదంలో మరణించిన యాసీన్ అలీ, కిరణ్‌కుమార్‌ల తండ్రులైన షరాఫత్ అలీ, శ్రీనివాసులు ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నారు. తమ పిల్లలు తరచూ కలికిరిలోని రైల్వే బ్రిడ్జి వద్ద ఉన్న ఓ మందుల దుకాణం నుంచి ఏవో మాత్రలు కొని తెచ్చుకునే వారని, వాటిని మింగిన తరువాత వారు మత్తులోకి జారుకునే వారని వారు బహిర్గతం చేశారు. అంతేకాకుండా గంజాయి కూడా వారు అక్కడి నుంచే తెచ్చుకునే వారని వారు స్పష్టం చేశారు. కలికిరిలోనూ అనేక విద్యాసంస్థలు ఉండడం, అనేక నిర్మాణ పనులు జరుగుతుండడంతో దేశంలోని అనేక ప్రాంతాల నుంచి విద్యార్థులు, భవన నిర్మాణ రంగ కార్మికులు అక్కడ తాత్కాలికంగా స్థిరపడ్డారు. వారి ద్వారా గంజాయి సులువుగా అక్రమ రవాణా జరుగుతోందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



సంఘటనా స్థలంలో లభ్యమైన గంజాయి సేవించే ప్లాస్టిక్ బాటిల్

వెలుగులోకి రాని యాసీన్, కిరణ్‌లు ఎందరో..?

రైలు కింద మృతి చెందడంతో యాసీన్ అలీ, కిరణ్‌ల వ్యవహారం వెలుగులోకి వచ్చిందని, వెలుగులోని రాని యువకులు వందల సంఖ్యల్లో ఉన్నారని బుధవారం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో గుసగుసలు వినిపించాయి. గంజాయి, మత్తు మాత్రలకు అలవాటుపడిన యాసీన్ అలీ, కిరణ్‌లకు వారి తల్లిదండ్రులు పలుమార్లు బెంగళూరులోని ఓ ప్రతిష్ఠాత్మక వైద్యశాలలో చికిత్స చేయించడంతో పాటు కౌన్సెలింగ్ కూడా ఇప్పించినట్లు తెలిసింది. అయినప్పటికీ వారు ఆ మత్తు సేవనాన్ని ఆపుకోలేక, చివరకు ఆ మత్తు ప్రభావంతో రైలు కింద పడిపోయినట్లు వారి స్నేహితులు తెలిపారు. అయితే యాసీన్, కిరణ్ లాంటి వారు చాలా మంది ఉన్నారని, తిరుపతి, మదనపల్లె, బెంగళూరు ప్రాంతాలకు వెళ్లి కొంత కాలం ఉండి వచ్చిన తమ స్నేహితులు చాలా మంది గంజాయికి అలవాటు పడ్డారని, వారి ద్వారా తమలోని చాలా మంది అలవాటు చేసుకున్నారని వారు వెల్లడించారు. పీలేరు ప్రాంతంలో పెద్దఎత్తున గంజాయి అమ్మకాలు సాగుతున్నా వాటిని పసిగట్టడంలో పోలీసుల యంత్రాంగం పూర్తిగా విఫలమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ పిల్లలకు గంజాయి, మత్తు మాత్రలు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకొమ్మని తాము పలుమార్లు పోలీసులకు తెలియజేసినా వారు పట్టించుకోలేదని యాసీన్ అలీ, కిరణ్‌ల తండ్రులు షరాఫత్ అలీ, శ్రీనివాసులు బుధవారం స్థానిక విలేఖరులకు తెలియజేశారు.



నాకొచ్చిన కష్టం ఇతరులకు రాకూడదు..

కలికిరిలో అవేవో మాత్రలు అమ్ముతున్నారని నేను పోలీసులకు చాలాసార్లు చెప్పినా పట్టించుకోలేదు. వాటిని, గంజాయిని పూర్తిగా అరికట్టాలి. నాకు వచ్చిన కష్టం ఎవరికీ రాకూడదు. ఇప్పటికైనా పోలీసులు పట్టించుకుని వాటిని పూర్తిగా అరికట్టాలి.

- శ్రీనివాసులు, కిరణ్ తండ్రి

స్పందించిన ఎమ్మెల్యే

గంజాయి మత్తులో ఇద్దరు యువకులు రైలు కింద పడి దుర్మరణం చెందారన్న విషయం తెలియగానే ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి స్పందించారు. పీలేరు మండల టీడీపీ అధ్యక్షుడు వారణాశి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు అమరనాథరెడ్డి, తన వ్యక్తిగత కార్యదర్శి సత్యను సంఘటనా స్థలంతో పాటు యాసీన్ అలీ, కిరణ్‌ల ఇళ్లకు పంపారు. వారు ముగ్గురూ సంఘటన వివరాలు సేకరించి ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఆ వెంటనే ఆయన పీలేరులో గంజాయి అమ్మకాలు, కలికిరిలోని మందుల దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడుకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా కలికిరిలోని మందుల దుకాణాలపై విచారించాలని స్థానిక టీడీపీ నాయకులను ఆదేశించారు. యువకుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, విక్రేతలను ఉపేక్షించేది లేదని ఆయన ఆంధ్రజ్యోతితో తెలిపారు.

పీలేరులో రైల్వేట్రాక్ వెంబడి గంజాయి అమ్మకాలు

పీలేరు పట్టణం గూండా సాగుతున్న రైల్వే ట్రాకును ఆలంబనగా చేసుకుని జోరుగా గంజాయి అమ్మకాలు, సేవనం సాగుతున్నట్లు తెలిసింది. ప్రమాదాలను నివారించే లక్ష్యంతో రైల్వేశాఖ వారు పీలేరు పట్టణం గూండా సాగుతున్న రైల్వే ట్రాకుకు ఇరవైపులా కాంక్రీటు గోడ నిర్మించారు. ఈ గోడ అటు అక్రమార్కులు, ఇటు మత్తుకు అలవాటుపడిన యువకులకు ఆశ్రయంగా మారింది. గోడ బాగా ఎత్తుగా ఉండడం, రైల్వే ట్రాకు పక్కన ఉన్న పొదలు, చెట్ల చాటున కూర్చుంటే ఇతరులకు కనబడకుండా ఉండడంతో అటు చిత్తూరు మార్గంలోని రైల్వే క్రాసింగ్ నుంచి ఇటు ప్రభుత్వ ఆసుపత్రి వెనుక ప్రాంతం వరకు నిత్యం యువకుల తాడికి ఉంటోందన్న స్థానికులు తెలిపారు. యాసీన్ అలీ, కిరణ్ కుమార్‌లు కూడా ఆర్టీసీ నల్లగుట్ట సమీపంలో ఉన్న ఇటువంటి నిర్జన ప్రదేశాన్ని ఎంచుకుని మంగళవారం రాత్రి గంజాయి సేవించి రైలు కింద పడి దుర్మరణం చెందారు. ఇద్దరి జేబుల్లోనూ గంజాయి ప్యాకెట్లు దొరకడం, సంఘటనా స్థలంలో వారు గంజాయి సేవించిన ప్లాస్టిక్ బాటిల్ లభ్యం కావడం ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. రైల్వే ట్రాకు పొడవునా గంజాయి సేవించే బాటిళ్లు, మద్యం ఖాళీ సీసాలు, ఖాళీ సిలైన్ బాటిళ్లు, నాటు సారా ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయి.



ఆర్టీసీ నల్లగుట్ట వద్ద యువకులు తరచూ గంజాయి సేవిస్తున్న ప్రాంతం

రౌడీషీటర్లపై 'డిజిటల్ వాచ్'

- మన ఊరు- మన పోలీసు
- డీఎస్పీ కొండయ్యనాయుడు



ముఖాముఖి

మదనపల్లె టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలో రౌడీ షీటర్లపై 'డిజిటల్ వాచ్' నిఘా ఉంచామని మదనపల్లె డీఎస్పీ డి.కొండయ్యనాయుడు వెల్లడించారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాలతో మన ఊరు-మన పోలీసు కార్యక్రమాలతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. పలు అంశాలపై ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడారు.

ప్రశ్న: సబ్ డివిజన్‌లో రౌడీషీటర్లపై నిఘా తగ్గిందా..? నేరాలు పెరుగుతున్నాయి...?

జవాబు: మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలోని రెండు నియోజకవర్గాల్లో నమోదైన రౌడీషీటర్లపై డిజిటల్ వాచ్ పెట్టాము. వారి మొబైల్ ఫోన్ల లాంగిట్యూడ్, లాటిట్యూడ్‌తో వారి కదలికలను గమనిస్తూ ఉన్నాము. వారిచ్చిన వివరాలు ప్రకారం డిజిటల్ వాచ్‌లో తేడాలు వస్తే రౌడీషీటర్లను పిలిచి రెండో కౌన్సిలింగ్ ఇస్తున్నాము. మూడోసారి క్రమం తప్పితే తిరిగి కేసులు పెడుతున్నాము.

ప్రశ్న: మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో భూకబ్జాలు పెరుగుతున్నాయి..వాటిపై ఏమి చర్యలు చేపట్టారు?

జవాబు: రెండు నియోజకవర్గాల పరిధిలోని 11 పోలీసుస్టేషన్‌లకు వస్తున్న భూ వివాదాల ఫిర్యాదులపై సమగ్ర విచారణకు భూమి వివరాల కోసం సబ్‌కలెక్టర్‌కు పంపుతున్నాము. అక్కడి నుంచి వచ్చే నిజమైన అర్హులకు పక్కా ఆధారాలతో ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేస్తున్నాము. భూఆక్రమణలు, దౌర్జన్యం చేస్తున్న వారిపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులు పెడుతున్నాము.

ప్రశ్న: డివిజన్‌లో వరుస మర్డర్లు జరుగుతున్నాయి..వీటికి కారణం?

జవాబు: రెండు నియోజకవర్గాల్లో వ్యక్తిగత కక్షలతోనే ఎక్కువగా మర్డర్లు జరిగాయి. ముఖ్యంగా వ్యక్తిగత కక్షలు, మద్యం, గంజాయి సేవించిన మత్తులో డబ్బు కోసం ఈ హత్యలు జరిగినట్లు తెలుస్తోంది. అందుకే మన ఊరు-మన పోలీసు కార్యక్రమంలో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి ప్రజలకు దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నాం. దురదృష్టవశాత్తు జైలుకు వెళితే వారి శేష జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో వివరిస్తున్నాము.

ప్రశ్న: డాబాలు, బెల్టుషాపులు ఎక్కువవుతున్నాయి?

జవాబు: డివిజన్‌లో ప్రైవేటు మద్యం దుకాణాలు వచ్చాయి. గ్రామాల్లో బెల్టుషాపులు పెట్టకుండా నిఘా పెట్టాము. మదనపల్లె, బి.కొత్తకోట, ములకలచెరువు, అంగళ్లు పట్టణాల్లో డాబాల యజమానులకు ముందస్తు హెచ్చరికలు జారీ చేశాము. అంగళ్లులో డాబాలు నిర్వహిస్తూ మద్యం తాపిస్తున్న యజమానులు ఐదుగురిపై కేసులు పెట్టాము. డాబాలపై స్పెషల్ పార్టీ పోలీసులతో నిఘా పెట్టాము.

ప్రశ్న: ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ లాటరీలు ఎక్కువవుతున్నాయి.. ఏమి చర్యలు చేపట్టారు?

జవాబు: డివిజన్‌లో ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌పై ప్రభుత్వం నిషేధం విధించిన విషయం తెలిసిందే. యువత కర్ణాటక లోకేషన్‌తో యాప్‌లు డౌన్‌లోడ్ చేసి గ్యాంబ్లింగ్, బెట్టింగ్‌లు ఆడుతున్నారు. కళాశాలలకు వెళ్లి కౌన్సిలింగ్ ఇస్తాము. మదనపల్లెలో ఆన్‌లైన్ లాటరీ జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తే తప్పకుండా నిఘా పెట్టి నిర్వాహకులను అరెస్టు చేస్తాము.

ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు.. దెబ్బతిన్న ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు





పెళ్లింట విషాదం..

- మలిపెళ్లికి వెళుతూ పరలోకానికి...
- ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు, ఇన్నోవా ఢీ
- ముగ్గురు కర్నూలు వాసులు మృతి

రైల్వేకోడూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓ బస్సు అతివేగం పెళ్లింట విషాదం నింపింది. రెండు రోజుల క్రితం వివాహం జరిగింది. మలిపెళ్లికోసం బంధువులతో కలసి పెళ్లికూతురు తరఫు వారు తిరుపతికి వెళుతుండగా ఎదురుగా వచ్చిన బస్సు ఢీకొనడంతో ముగ్గురు మృతిచెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో పెళ్లింట విషాదం నెలకొంది. వివరాలు ఇలా..

ఈనెల 20న కర్నూలుకు చెందిన సుశాంక్ అనే యువకుడి అక్కకు తిరుపతికి చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. వివాహం సందర్భంగా తిరుపతిలో గురువారం జరిగే మలిపెళ్లి కార్యక్రమానికి హాజరు కావడానికి నూతన వధువు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తదితరులు కర్నూలు నుంచి వాహనాల్లో తిరుపతికి బయలుదేరి వెళుతుండగా.. సాయంత్రం 5 గంటల సమయంలో రైల్వేకోడూరు మండలం మైసూరివారిపల్లె పంచాయతీ పరిధిలో రాజానగర్ ప్రధాన రహదారిలో తిరుపతి నుంచి కడపకు వెళుతున్న ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు ఇన్నోవాను ఢీకొంది. దీంతో ఇన్నోవాలో ఉన్న ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్సుల్లో తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించి తిరుపతిలోని అమర ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో రాజేశ్వరి, లలితమ్మ, ఉపేంద్ర, మహేశ్, ప్రేమ్‌కుమార్, సుచిత్ర, వాసవి తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి ఆస్పత్రిలో రావూరి ప్రేమ్‌కుమార్ (51), వాసవి (48), సుచిత్ర (40) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుల శవాలను శవపరీక్ష నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించనున్నారు. మృతులు, క్షతగాత్రులు కర్నూలుకు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. ప్రమాద సంఘటన తెలుసుకున్న కర్నూలులోని బంధువులు, స్నేహితులు తిరుపతికి చేరుకుంటున్నారు. ఈ విషాద సంఘటన తెలియగానే కర్నూలులోని అశోక్‌నగర్, ప్రకాష్‌నగర్‌లలో విషాదఛాయలు అలుముకున్నాయి. అదే విధంగా తిరుపతిలోని బంధువులు ఆస్పత్రికి చేరుకున్నారు. పెళ్లింట విషాదం జరగడంతో మృతుల కుటుంబాలు, క్షతగాత్రుల కుటుంబాలు వారు బోరుమని విలపించారు. అలాగే ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న కడపకు చెందిన ప్రభాకర్, మహ్మద్ గాయపడ్డారు. రోడ్డు ప్రమాదం సమాచారం తెలుసుకున్న రైల్వేకోడూరు సీఐ హేమసుందర్‌రావు సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు ముందు భాగం దెబ్బతింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వేకోడూరు సీఐ హేమసుందర్‌రావు తెలిపారు.



మృతి చెందిన వాసవి





మృతి చెందిన ప్రేమ్‌కుమార్, సుచిత్ర

సమాజ సేవకులు

- నిరుపేదలకు ఆసరా..సహారా..
- మానవత్వం చాటుతున్న యువత

6



వేగవంతంగా సమస్యల పరిష్కారం

- రెవెన్యూ అధికారుల సమీక్షలో కలెక్టర్ శ్రీధర్

రాజంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సమస్యల పరిష్కారంలో పారదర్శకతను పాటిస్తూనే త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం రాజంపేటలోని కళాంజలి కల్యాణమండపంలో సబ్‌కలెక్టర్ నిధియాదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారుల సమీక్ష సమావేశానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సేవల్లో వేగం, నాణ్యత, పారదర్శకత ముఖ్యమన్నారు. వీఆర్వో నుంచి ఆర్డీవో వరకు పనితీరులో ప్రమాణాలను పెంచుకోవాలన్నారు. ప్రజలతో కలిసిమెలిసి మమేకమై వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రతి సోమవారం వచ్చే రెవెన్యూ అర్జీలపై ముఖ్యమంత్రి కార్యాలయం స్వయంగా సమీక్షిస్తూ ఉంటుందని, ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ కార్యక్రమంపై సంబంధిత అధికారులు ఎంతో ముందుచూపుతో పరిష్కారం చేయాలన్నారు. తమ పరిధిలోని దరఖాస్తులను మూడు రోజుల్లో పరిష్కరించాలన్నారు. నోటీసులు ఇవ్వాల్సి వస్తే 15 రోజులు, జేసీ, కలెక్టర్ స్థాయికి వెళ్లాల్సి వస్తే నెల రోజుల్లోపు ఆ సమస్యను పరిష్కరించడానికి తహసీల్దార్లు కృషి చేయాలని తెలిపారు. సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం చేయడం తగదన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వివిధ రెవెన్యూ సేవల్లో రాజంపేట రెవెన్యూ డివిజన్ ఎంతో ముందంజలో ఉందని అభినందించారు. కోర్టు కేసులు, లోకాయుక్త, జాతీయ మానవ హక్కుల కమిషన్ కేసులపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. రాజంపేట మున్సిపాలిటీలో మురుగునీటి శుద్ధి కార్యక్రమం నిమిత్తం భూసేకరణ అంశంపై తక్షణం చర్యలు తీసుకోవాలని తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారంలో తహసీల్దార్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. వలస కార్మికులకు రేషన్‌కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, దీనిపై మండలాల వారీగా పారదర్శకంగా విచారణ చేసి వలస కార్మికులకు రేషన్‌కార్డుల జాబితా తయారు చేయాలని చెప్పారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ నిధియాదేవి, జిల్లా సర్వేయర్ అధికారి భరత్‌కుమార్‌లతో పాటు అన్ని మండలాల తహసీల్దార్లు, సర్వేయర్‌లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట డివిజన్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్



రైతాంగాన్ని ఆదుకుంటాం

- ఎంఎస్ఎంఈని జిల్లాకు రప్పిస్తాం
- కాంట్రాక్టు కార్మికుల శ్రమదోపిడీని సహించం
- అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి
- జడ్పీ సమావేశంలో ప్రజాప్రతినిధులు
- మేనిఫెస్టోపై టీడీపీ, వైసీపీ చిటపటలు
- అన్నమయ్య ప్రాజెక్టును పునర్‌నిర్మించాలి
- కరువు మండలాలను ప్రకటించాలి
- సమస్యలపై వాడీవేడీ చర్చ

కడప రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అనావృష్టి, అతివృష్టి వర్షాలతో పంటలు దెబ్బతిని ఇబ్బంది పడుతున్న జిల్లా రైతాంగాన్ని ఆదుకుంటామని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. జిల్లా నుంచి తరలిపోయిన మైక్రో స్మాల్ మీడియం ఎంటర్ ప్రైజెస్ టెక్నాలజీ పార్కు(ఎంఎస్ఎంఈ)ను తిరిగి జిల్లాకు రప్పించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జె.శారద అధ్యక్షతన బుధవారం జడ్పీ మీటింగ్ హాలులో నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా కొనసాగింది. మైక్రో స్మాల్ మీడియం ఎంటర్ ప్రైజెస్ టెక్నాలజీ పార్కు(ఎంఎస్ఎంఈ), అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, డీఎస్సీ, ఉచిత గ్యాస్ పంపిణీ తదితర వాటి విషయంలో వైసీపీ ప్రజాప్రతినిధులు టీడీపీ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని చేసిన ప్రయత్నాలను టీడీపీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి తిప్పికొట్టారు. కూటమి పాలనలో ప్రజాప్రభుత్వం విజయవంతంగా నడుస్తోందన్నారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. అధికారులు ఇందుకు తగ్గట్టుగా బాధ్యతగా పని చేసి ప్రజలకు అండగా నిలవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఒప్పించి ఎంఎస్ఎంఈను తిరిగి జిల్లాకు రప్పించేలా కృషిచేస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అమ్మఒడిని మొదటి ఏడాదిలో ఇవ్వలేదని గుర్తు చేశారు. తమ టీడీపీ ప్రభుత్వంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం కింద 5 సంవత్సరాలపాటు ఇస్తామన్నారు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు ఏడాదికి రూ.20వేలు అందించే కార్యక్రమం రూపుదాల్చుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఇదిగో డీఎస్సీ అదిగో డీఎస్సీ అంటూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడిందని టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ఫైల్‌పై చంద్రబాబు సీఎంగా మొదటి సంతకం చేసి 15,600 ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టారన్నారు. దీపావళి నుంచి అర్హులైన వారందరికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్ల పంపిణీని చేపడుతున్నామనామని వైసీపీ నేతల దాడిని తిప్పికొట్టారు.

గత వైసీపీ ప్రభుత్వంలో ఔట్‌సోర్సింగ్ కార్మికుల శ్రమదోపిడీ అధికమైందని టీడీపీ పాలనలో అలా కొనసాగడానికి వీలులేదన్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాల విషయంలో కాంట్రాక్టర్లు అధిక మొత్తంలో దోపిడీ చేస్తున్నారన్నారు. రూ.14వేల వరకు ప్రభుత్వం జీతం ఇస్తుంటే ఇందులో రూ.4వేలను కాంట్రాకర్లు కమీషన్‌గా తీసుకుని కేవలం రూ.10వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఇదిచాలా అన్యాయమన్నారు. ఈ విషయంలో జిల్లాలోని ఆయా కాంట్రాక్టు ఏజెన్సీలతో జిల్లా అధికారులు సమావేశమై కాంట్రాక్టు ఉద్యోగులకు న్యాయంచేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

గత వైసీపీ పాలనలో కొంత మంది స్వార్థపరులు అధికారులతో నిబంధనలకు వ్యతిరేకంగా పనులు చేయించారన్నారు. కూటమి ప్రభుత్వంలో అలాంటిది ఉండదన్నారు. రౌడీయిజం చెల్లదని దానిని పక్కనపెట్టాలన్నారు. ఎవరైనా ఎంతటివారైనా ప్రజాస్వామ్యబద్ధంగా నడుచుకోవాల్సిందే అన్నారు. వీఎన్‌పల్లె మండలంలో పనిచేయడానికి వీఆర్‌వోలు ఎవరూ ఇష్టపడడంలేదని ఎంపీపీ రఘునాథరెడ్డి అన్న మాటలపై ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ బెదిరింపు చర్యలు ఉన్నాయేమోనని అన్నారు. ప్రజాప్రతినిధులలో కూడా మార్పు రావాలన్నారు. ఫిర్యాదులను స్వయానా జేసీ స్థాయిలో విచారించాలని తప్పుడు ఫిర్యాదులైతే అధికారులను ఇబ్బందిపెట్టరాదన్నారు. ప్రొద్దుటూరు మండలం తాళ్లమాపురం గ్రామంలో ఒక్క చేనేత కార్మికుడు లేకపోయినా 50 మందికి పైగా చేనేత పింఛన్లను అందుకుంటున్నారని దీనిపై విచారణ జరిపించాలన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ వీఎన్‌పల్లె మండలం గడ్డంవారిపల్లె రెవెన్యూ పొలంలోని ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రార్థనామందిరాన్ని నిర్మిస్తున్నారని అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు.

మేనిఫెస్టోపై టీడీపీ, వైసీపీ చిటపటలు

టీడీపీ, వైసీపీ ఎన్నికల మేనిఫెస్టోలపై ఆ పార్టీ ప్రజాప్రతినిధులు చిటపటలాడారు. టీడీపీ మేనిఫెస్టోలో పొందుపరిచిన మేరకు తల్లికి వందనం కింద విద్యార్థులకు ఇస్తామన్న డబ్బులు ఎప్పుడిస్తారని, అలాగే అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు పెట్టుబడి సాయం, డీఎస్సీ భర్తీని ఎప్పుడు చేపడతారని..

తరువాయి 6లో..

నివాసాల మధ్య దుకాణం వద్దే.. వద్దు...



● మద్యం దుకాణం ఎదుట ప్రజల ధర్నా

మదనపల్లె టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తున్నారని, గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. బుధవారం మదనపల్లె మండలం తట్టివారిపల్లె పంచాయతీ భవానీనగర్ వద్ద ఏర్పాటు చేసిన దాము వైన్స్ ఎదురుగా ప్రజలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవానీనగర్‌లో నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేశారని, ఇక్కడ మద్యం కొనుగోలు చేసిన వ్యక్తులు పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోనే మద్యం తాగి ఆ మత్తులో గొడవలు చేస్తున్నార న్నారు. ఈ విషయమై ఇప్పటికే సీఎం చంద్రబాబు పేషీకి, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్రకు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌కు, సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదులు పంపామన్నారు. అధికారులు స్పందించి నివాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వేరొక చోటికి తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం కృష్ణ, గౌస్‌మొహిద్దీన్, రషీదా, అయాజ్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

● ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఎదుట నిరసన

రైల్వేకోడూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నివాసాల మధ్య మద్యం దుకాణం వద్దని ప్రజలు బుధవారం ర్యాలీగా వెళ్లి ఎక్సైజ్ శాఖ సీఐ కార్యాలయం ఎదుట జనసేన, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, జనసేన నాయకులు ముత్యాల కిషోర్, నాగోలు అమర్‌నాథ్ మాట్లాడుతూ రాంనగర్, ఒంటెలనగర్ మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని అక్కడ నుంచి వేరే చోటికి తరలించాలని డిమాండ్ చేశారు. మద్యం దుకాణానికి సమీపంలో ప్రభుత్వ మెయిన్ పాఠశాలతో పాటు కళాశాల కూడా ఉందన్నారు. మద్యం దుకాణాన్ని ఆనుకుని కళాశాల, స్కూలుకు విద్యార్థులు వెళ్లవలసి ఉందన్నారు. మహిళలు తిరుగుతుంటారని తెలిపారు. మద్యం దుకాణాన్ని ఇక్కడి నుంచి తొలగించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందన్నారు. అనంతరం రైల్వేకోడూరు ఎక్సైజ్ శాఖ సీఐ తులసికి వినతిపత్రం సమర్పించారు. మద్యం దుకాణాన్ని పరిశీలిస్తామని సీఐ తెలిపారు.


ఎక్సైజ్ శాఖ సీఐ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రజలు

సమాజ సేవకులు...

● నిరుపేదలకు ఆసరా..సహారా.. ● మానవత్వం చాటుతున్న యువత

ఆదర్శం

వాల్మీకిపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సొంత ఊరికి ఏదో చేయాలన్న తపన.. తమకు ఉన్నంతలో తోటివారికి సాయం చేయాలన్న సేవా గుణం..నిరుపేదలకు అండగా నిలవాలన్న సంకల్పం..సేవే మార్గం సేవే లక్ష్యంగా..మానవత్వం చాటుతున్న ఆ యువకులు ఎందరికో ఆదర్శంగా నిలిచారు. వాల్మీకిపురం పట్టణానికి చెందిన యువత సహారా ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి పేదలకు ఆసరాగా ఉంటూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, మరికొందరు ప్రభుత్వ కొలువులు, ఇంకొందరు చిరు వ్యాపారులు.. ఇలా పట్టణానికి చెందిన సాదిక్‌అహ్మద్, జమీల్, ఇక్బాల్, షాహిద్, రహంతుల్లా, అయ్యప్ప, బావాజాన్, నిరంజన్, కలందర్, ఖదీర్, సయ్యద్‌బాషా, అష్రఫ్, ఆషర్, ఇర్ఫాన్, నవాజ్, ఇమ్రాన్, జహీర్, మహ్మద్, సుల్తాన్, ప్రసాద్, ఈషాన్ తదితర 15 మందికి పైగా స్నేహితులు వివిధ రంగాలలో రాణిస్తున్నారు. ఈ మిత్ర బృందం అంతా కలిసి సేవాగుణంతో జట్టుగా ముందుకొచ్చారు. 2011వ సంవత్సరం జూలై 2న సహారా ఛారిటబుల్ ట్రస్టును నెలకొల్పారు. ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమాలతో పేదలకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. వాల్మీకిపురం మండలం వ్యాప్తంగా సుమారు 270కి పైగా నిరుపేద కుటుంబాలను ఎంపిక చేసుకుని సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ట్రస్టు ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఈ మిత్ర బృందం సుమారు రూ.60 లక్షలకు పైగా నిధులు పోగు చేసుకుని వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఎవరినీ సహాయం అడగకుండా ట్రస్టు సభ్యులే తమ సొంత డబ్బులతో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.


అంత్యక్రియల్లో ట్రస్టు సభ్యుల సహాయక చర్యలు (ఫైల్)

సహారా సేవలివీ..

- పేద కుటుంబాలలో యువతుల పెళ్లి ఖర్చుల కోసం రూ.5 లక్షల వరకు ఆర్థిక సాయం.
- స్థానిక నాయక్‌వీధికి చెందిన రెహమాన్ (41) ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతుండగా అతడికి వైద్య ఖర్చులకు రూ.2 లక్షల ఆర్థికసాయం అందించారు.
- కరోనా కష్టకాలంలో 9 0రోజుల పాటు ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం.
- మండలంలోని గండబోయనపల్లెకు చెందిన చిన్నారి తెహరీన్ (8), సయ్యద్‌బాషాలు అనారోగ్యంతో బాధపడుతుండగా రూ.45 వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు.
- 200 నిరుపేద కుటుంబాలను ఎంపిక చేసి ప్రతి ఆదివారం రెండు కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ.
- మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 60 మందికి శస్త్ర చికిత్సలు చేయించారు.
- కొవిడ్ మృతులకు ట్రస్టు ఖర్చులతో అంత్యక్రియలు.
- ప్రతి ఏటా నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ.
- క్షయ వ్యాధితో బాధపడుతున్న ఆరుగురు రోగులకు వైద్య ఖర్చులతో పాటు నిత్యావసర సరుకుల పంపిణీ.

తోటి వారిని ఆదుకోవడంలోనే సంతృప్తి..



మనకున్నంతలో తోటి వారికి సాయం అందించి ఆదుకోవడంలో నిజమైన సంతృప్తి కలుగుతుంది. స్నేహితులంతా కలిసి సేవే పరమావధిగా సహారా ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి నిరుపేదలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నాం. సేవా కార్యక్రమాల ద్వారా పెద్దల అభినందనలు, ఆశీర్వాదాలు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తున్నాయి. ప్రస్తుత సమాజంలో నిస్వార్థ సేవతో నిరుపేదలకు సాయపడే గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నదే మా మిత్ర బృందం విజ్ఞప్తి.

\- సాదిక్‌అహ్మద్, సహారా ఛారిటబుల్ ట్రస్టు, అధ్యక్షుడు, వాల్మీకిపురం


నిత్యావసర సరుకులు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు


అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న ట్రస్టు బృందం (ఫైల్)

జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపిక

రైల్వేకోడూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన రైల్వేకోడూరు నారాయణ స్కూలు విద్యార్థినులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 6, 7, 8 తేదీల్లో తిరుపతిలో జరిగిన పోటీల్లో నారాయణ స్కూలుకు చెందిన వై.లాస్య, పి.పవన్, రూపశ్రీ, ఎస్.మేధ ప్రతిభ ప్రదర్శించారు. త్వరలో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ప్రిన్సిపాల్ వెంకటసుధీర్ వివరించారు. ఆయా విద్యార్థినులను ఎస్‌ఐ నవీన్‌బాబు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్‌ఐ నవీన్‌బాబు

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు జాండ్రపల్లె విద్యార్థి

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు జాండ్రపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థి రాజేంద్ర ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 22న కడప మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన అండర్-17 క్రికెట్ విభాగంలో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు చక్రపాణి, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.



రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు...

సంబేపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు దేవపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పావని, గంగాదేవి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఫిజికల్ డైరెక్టర్ తెలిపారు. కడప మున్సిపల్ స్టేడియంలో ఈనెల 22న జరిగిన బాలికల అండర్-17 కబడ్డీ పోటీలో పావని, అండర్-14 విభాగంలో గంగాదేవి ప్రతిభ ప్రదర్శించారని వివరించారు. ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు రాయచోటిలో అండర్-17 పోటీలు నవంబరు 1 నుంచి 11 వరకు బాపట్ల జిల్లాలో అండర్-14 పోటీలు జరుగుతాయన్నారు.


రాష్ట్ర స్థాయికి ఎంపికైన పావని, గంగాదేవి

జిల్లా స్థాయి క్రీడల్లో జ్యోతిబాపూలే విద్యార్థుల ప్రతిభ

నందలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన ఆటల పోటీల్లో మహాత్మా జ్యోతిబాపూలే సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటారని ప్రిన్సిపాల్ నాగేశ్వరి తెలిపారు. అండర్-19 200 మీటర్ల పరుగులో పి.వర్షిత, 1500 మీటర్లలో హేమలత, ఫోర్‌కే పరుగులో కె.ఆశ, డిస్క్ త్రోలో ఎస్.నిత్య, జావెలిన్ త్రోలో ఎం.యోగిప్రభ, షాట్‌పుట్‌లో ఎస్.నిత్య, ఖోఖోలో పి.సాయి హారిక, ఎస్.నిత్య, పి.వర్షిత, కె.ఆశ, పి.వనిత, క్రికెట్‌లో సి.హేమలత, చెస్‌లో ఎస్.పవిత్ర, హ్యాండ్‌బాల్‌లో కె.ప్రతిభ,. ఎస్.నిత్య, త్రోబాల్‌లో కె.ప్రతిభ, టెన్నికాయిట్‌లో బి.గ్రీష్మ, జి.మాధురి, వాలీబాల్‌లో టి.తేజ, అండర్-17 విభాగం కబడ్డీలో ఎం.అమృత, క్యారమ్స్‌లో సి.రేఖ, క్రికెట్‌లో వి.భవ్యశ్రీ, అండర్-14 కబడ్డీలో వై.సంజీవ, క్యారమ్స్‌లో ఎల్.దివ్యశ్రీలు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.


ఎస్‌జీఎఫ్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థినులు

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థిని

పుల్లంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థిని జాస్మిన్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లీలా శ్రీహరి, పీడీ నీలకంఠరావు తెలిపారు. బుధవారం వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 హాకీ సెలక్షన్స్‌లో తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జాస్మిన్ ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.


విద్యార్థిని జాస్మిన్‌తో పీడీ నీలకంఠరావు

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కురబలకోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : డిప్లొమా చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన బుధవారం మండలంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పిచ్చలవాండ్లపల్లె పంచాయతీలోని ప్రైవేట్ అగ్రికల్చర్ డిప్లొమా కళాశాలలో గుర్రంకొండకు చెందిన విద్యార్థి రాఘవేంద్ర చదువుతున్నాడు. కాగా ఏమి జరిగిందో తెలియదు కానీ బుధవారం తను చదువుతున్న కళాశాలలోనే విద్యార్థి చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన తోటి విద్యార్థులు చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స అందించారు. కాగా విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి ప్రేమ వ్యవహారమే కారణమని పలువురు విద్యార్థులు చెబుతున్నారు. ఈ మేరకు సమాచారాన్ని ఆసుపత్రి ఔట్‌పోస్టు సిబ్బంది ముదివేడు పోలీసులకు అందించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చికిత్స పొందుతున్న రాఘవేంద్ర

'రంగోత్సవం'లో గురుకుల పాఠశాలకు అవార్డులు

కలికిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ కేంద్రంగా ఏటా జాతీయ స్థాయిలో విద్యార్థుల మధ్య జరిగే సృజనాత్మక కళలపై జరిగే పోటీలో ఈ ఏడాది స్థానిక జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలకు బహుమతుల పంట పండింది. గత జూలై నెలలో జరిగిన పోటీల్లో ఈ పాఠశాల నుంచి మొత్తం 80 విద్యార్థినులు పాల్గొన్నారు. అందులో 24 మందికి వివిధ రకాల అవార్డులు లభించాయి. వాటిని బుధవారం నిర్వాహకులు పాఠశాలకు పంపించారు. ఆర్ట్ మెరిట్ కేటగిరీలో 10వ తరగతి చదువుతున్న వి.కావ్యశ్రీ ప్రథమ బహుమతి సాధించింది. హ్యాండ్ రైటింగ్ విభాగంలో పదో తరగతి విద్యార్థిని ఎల్.అంజలికి కన్సొలేషన్ బహుమతి లభించింది. ఇవి కాకుండా డ్రాయింగ్, థంబ్ పెయింటింగ్, కార్టూన్ మేకింగ్, హ్యాండ్ రైటింగ్, గ్రీటింగ్ కార్డు తయారీ, కేరికేచర్ పోటీల్లో మరో 22 మంది అవార్డులు పొందారు. ఇందులో 10 మంది విద్యార్థినులకు గోల్డ్ మెడల్స్, 8 మందికి సిల్వర్ మెడల్స్ నలుగురికి కాంస్య పతకాలు అందాయి. గరిష్ట సంఖ్యలో విద్యార్థినులు బహుమతులు సాధించిన కారణంగా 'బెస్ట్ స్కూల్ ఫర్ ఫ్యూచరిస్టిక్ ఎడ్యుకేషన్' అవార్డు గురుకుల బాలికల పాఠశాల దక్కించుకుంది. పాఠశాల నిర్వహణలో ప్రతిభను కనబరిచిన ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ కూడా ప్రశంసాపత్రం, జ్ఞాపికను పొందారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రంగోత్సవం నిర్వాహకులు పంపిన మెడల్స్, ప్రశంసాపత్రాలను విజేతలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సోమశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


విద్యార్థినికి అవార్డు పంపిణీ చేస్తున్న సోమశేఖర్

రైతాంగాన్ని ఆదుకుంటాం

● ఎంఎస్‌ఎంఈని జిల్లాకు రప్పిస్తాం ● కాంట్రాక్టు కార్మికుల శ్రమదోపిడీని సహించం
● అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి ● జడ్పీ సమావేశంలో ప్రజాప్రతినిధులు

(5వ పేజీ తరువాయి)

సీకేదిన్నె జడ్పీటీసీ సభ్యుడు నరేన్ రామాంజుల రెడ్డి ప్రశ్నించారు. ఈ విషయంపై ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం వారి మేనిఫెస్టోను తుంగలో తొక్కిందన్నారు. ప్రతి ఏడాది ఉద్యోగాల భర్తీ అని జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేసారే కాని ఉద్యోగాల భర్తీ మాత్రం జరగలేదన్నారు. ఇక పోతే అమ్మ ఒడిని 2019లో ఇవ్వకుండా వంచనచేసింది మీరు కాదా అని ప్రశ్నించారు.

అజెండాపై ఫైర్

జడ్పీ సర్వసభ్య సమావేశం అజెండాపై టీడీపీ ప్రజాప్రతినిధులు వరదరాజులరెడ్డి, రామగోపాల్‌రెడ్డి ఫైర్ అయ్యారు. అజెండా ఇవ్వకపోతే తాము ఏమి మాట్లాడాలని ప్రశ్నించారు. జడ్పీ డిప్యూటీ సీఈవో మైథిలి మాట్లాడుతూ అజెండాను సభ్యులకు రిజిస్టర్ పోస్టు చేశామని అనగా ఎందుకు అబద్ధాలు చెబుతున్నారు.. అజెండా పంపినట్లు నిరూపిస్తే తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని రామగోపాల్‌రెడ్డి ఘాటుగా మాట్లాడారు. మీ కోరిక మేరకు పంపుతామని మైథిలి పేర్కొనగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పంపడం తప్పనిసరి అన్నారు. సమావేశం ఉదయం 10 గంటలకని 11 గంటలకు ప్రారంభించడం ఏ సంప్రదాయమని చురకలంటించారు. ఈసారైనా సమావేశాన్ని అనుకున్న సమయానికి ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను రానున్న సమావేశం నాటికి పరిష్కరించాలన్నారు. ఈ సారి సమావేశంలో చర్చకు జడ్పీ శాఖను కూడా చేర్చాలన్నారు.

ఎవరేమన్నారంటే..

జడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రజాసమస్యలపై వాడీవేడీ చర్చ కొనసాగింది. అజెండా అంశాలవారీగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను వినిపించగా పలువురు సభ్యులు లెవనెత్తిన అంశాలపై అధికారులు సమాధానమిచ్చారు.

- అక్టోబర్ 23న క్యాబినెట్ సమావేశం ఉందని ముందే తెలుసుకదా.. మంత్రులు లేరు సీఈవో లేరు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఎవరిస్తారని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు.
- జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం చిన్నకొమెర్ల గ్రామంలోని వంక సమీపంలో దాల్మియా యాజమాన్యం సీమెంట్ ఫ్యాక్టరీని 2006లో ఏర్పాటుచేసిందన్నారు. దీని కారణంగా వంకకు వరద వచ్చినప్పుడు నీరు ప్రవహించడానికి వీలులేకుండా ఉండడం వలన సమీపంలోని ఎస్సీకాలనీ, నవాబ్‌పేటతో పాటు 400 ఎకరాలు ముంపునకు లోనవుతోందని బాధిత రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు.
- రాజంపేట నియోజకవర్గంలోని అన్నమయ్య ప్రాజెక్టుకు పునర్‌నిర్మించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి తగిన నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి కోరారు. ప్రాజెక్టు నిర్మాణం జరిగితే అక్కడి ప్రజలకు తాగురు, రైతాంగానికి సాగు నీరు అందుతుందన్నారు.
- రాష్ట్రప్రభుత్వం రైతులకు సబ్సిడీద్వారా అందిస్తున్న విత్తనాలు బయటి మార్కెట్ కన్నా అధిక రేట్లు ఉన్నాయని పెండ్లిమర్రి, సీకేదిన్నె, కమలాపురం జడ్పీటీసీలు పిట్టుబాలయ్య, నరేన్‌రామాంజులరెడ్డి, వీఎన్‌పల్లె ఎంపీపీ రఘునాథరెడ్డి పేర్కొన్నారు.
- వీరపునాయునిపల్లె మండలంలో ఇద్దరు ముగ్గురు వీఆర్‌వోలు మాత్రమే ఉన్నారని ఈ కారణంగా మండలంలో రెవెన్యూసేవలు పూర్తి స్థాయిలో అందడంలేదని ఎంపీపీ అన్నారు. అలాగే గంగిరెడ్డిపల్లెను రెవెన్యూ విలేజ్‌గా మార్చాలని, వెబ్‌ల్యాండ్‌లో ఆ గ్రామమే చూపడంలేదని తెలిపారు.
- ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు విషజ్వరాల బారిన పడి అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వ ఆసుపత్రులలో వందశాతం కాన్పులు జరిగేలా చూడాలని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. పోరుమామిళ్ల పీహెచ్‌సీలో వైద్యుల కొరత ఉందని ఉన్న కొద్దిపాటి సిబ్బంది కూడా సమయపాలన పాటించడంలేదని జడ్పీటీసీ చెన్నయ్య తెలిపారు. చెన్నూరు పీహెచ్‌సీని సీహెచ్‌గా మార్చినప్పటికి తగినంతమంది వైద్యులు లేరని సాయంత్రం 4 గంటలకే తాళాలు వేసుకుని వెళ్తున్నారని ఎంపీపీ తెలిపారు.
- పశువుల దాణా రేటును తగ్గించి పాడిరైతులను ఆదుకోవాలని పెండ్లిమర్రి, చక్రాయపేట జడ్పీటీసీలు పిట్టుబాలయ్య యాదవ్, శివప్రసాద్‌రెడ్డి కోరారు.
- జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని వెంటనే భర్తీ చేసి 10వ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఎమ్మెల్సీతో పాటు పెండ్లిమర్రి జడ్పీటీసీ బాలయ్య యాదవ్ కోరారు. కమలాపురం బ్రిడ్జి పనులను త్వరలో పూర్తిచేయాలని, చిన్నచెప్పలి నుంచి సంగమేశ్వర దేవస్థానం రోడ్డు పనులను పూర్తిచేయాలని, కమలాపురంలో ఇండోర్ స్టేడియం పనులను పూర్తిచేయాలని, కమలాపురం ఆసుపత్రిలో గైనకాలజిస్టును ఏర్పాటు చేయాలని జడ్పీటీసీ కోరారు.
- ఇన్‌చార్జ్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రజలకు అన్నివిధాలుగా మంచిచేసేందుకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను జిల్లా యంత్రాంగం పరిధిలో లేనివాటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు.
- జడ్పీ చైర్‌పర్సన్ జె.శారద మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించి రాష్ట్రంలోనే ఆదర్శంగా రూపొందించడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. శాఖలవారీగా అన్నిరకాల అభివృద్ధి పథకాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందేలా జిల్లా పరిషత్ అన్నిరకాల చర్యలను చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, అన్నమయ్య జిల్లా డీఆర్‌వో సత్యనారాయణ, జడ్పీ డిప్యూటీ సీఈవో మైథిలి, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఆయాశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చైతన్యరెడ్డి, వరదరాజులరెడ్డి, ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

బెంగళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైల్వే నిర్మాణానికి మంగళం పలికినట్లేనా?

వేంపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి-మదనపల్లె-బెంగళూరు నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గం నిర్మాణానికి మంగళం పలికినట్లు కనిపిస్తోందని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాయలసీమ సమగ్రాభివృద్ధికోసం 2008-09 రైల్వే బడ్జెట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం ఖర్చు భరించే షరతుతో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును మంజూరు చేసిందన్నారు. 2010లో పనులకు శంకుస్థాపన జరగ్గా మొదటి దశ పని రూ.351కోట్లతో కడప నుంచి పెండ్లిమర్రి వరకు 21.80 కిలోమీటర్లు పూర్తైందన్నారు. ఇంతలో రాష్ట్రంలో ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులు విడుదల చేయలేదన్నారు. రైల్వేశాఖ పనులు నిలిపివేసిందన్నారు. ఇంతటితో ఆగక ఈప్రాజెక్టు వద్దు.. దీనికి బదులు ముద్దనూరు-పులివెందుల-ముదిగుబ్బ లైన్ మంజూరు చేయాలని వైసీపీ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందన్నారు. ఈలోపు వైసీపీ ఓడిపోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి రైల్వే ప్రాజెక్టులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారన్నారు. అన్ని ప్రాజెక్టులకు గ్రీన్ స్నిల్ ఇచ్చారు కానీ కడప-బెంగళూరు లైన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదన్నారు. రైల్వే అలైన్‌మెంటులో మార్పులు జరిగాయని, దీనిపై మరింత చర్చించి నిర్ణయ తీసుకోవాని చెప్పి పక్కనపెట్టడం జరిగిందన్నారు. దీని బట్టి చూస్తే ఈ ప్రాజెక్టుకు మంగళం పాడినట్లు కనిపిస్తోందన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో వీసీ విజయ్‌కుమార్, డైరెక్టర్ తదితరులు

వేంపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఈనెల 20న నిర్వహించిన ఆర్జీయూకేటీ అంతర్ కళాశాలల పోటీల్లో వివిధ క్రీడాంశాలలో ఆర్కేవ్యాలీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఆలిండియా/సౌత్‌జోన్ విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపికైనట్లు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. బాస్కెట్ బాల్ పోటీలకు ముగ్గురు బాలురు, ఇద్దరు బాలికలు, బ్యాండ్మింటన్ (షటిల్)లో ఒక బాలుడు, ఇద్దరు బాలికలు, కబడ్డీకి ముగ్గురు బాలురు, ఐదుగురు బాలికలు ఎంపికయ్యారన్నారు. వీరిని ఆర్జీయూకేటీ వైస్‌చాన్సలర్ విజయ్‌కుమార్, ఏఓ రవికుమార్, పీడీ పీవీ రమణారెడ్డి, వి.బాల ఓబయ్య, ఎస్కే షంషాద్ బేగంలు అభినందించారు.

ఒలంపియాడ్‌లో సత్తా చాటిన శ్రీచైతన్య విద్యార్థులు



ఒలింపియాడ్‌లో సత్తా చాటిన విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం రమణయ్య

సికెదిన్నె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఒలింపియాడ్ మేథమేటిక్స్ క్వాలిఫైడ్స్‌లో బృందావనం శ్రీచైతన్య విద్యార్థులు ఆరుగురు తమ సత్తా చాటినట్లు విద్యాసంస్థల ఏజీఎం రమణయ్య తెలిపారు. జాతీయస్థాయిలో సెప్టెంబరు నెలలో దేశవ్యాప్తంగా నిర్వహించిన గణితశాస్త్ర ఒలింపియాడ్ పరీక్షల్లో శ్రీచైతన్య విద్యార్థులు నవనీత, జ్వలిత, జగన్నాథం, యశశ్వి, పునీత్‌రెడ్డి, ఎస్ఎండీ సైఫ్ అనే విద్యార్థులు అర్హత సాధించారని, ఇది శ్రీచైతన్య విద్యాసంస్థలతో పాటు కడప జిల్లాకే గర్వకారణమన్నారు. ఈ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌తో పాటు సర్టిఫికెట్స్ అందజేయడం జరుగుతుందన్నారు. భారతదేశంలో నిర్వహించే వివిధ పోటీ పరీక్షల్లో శ్రీచైతన్య విద్యార్థులు ఎక్కువ మంది అర్హత సాధిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు ప్రతిభ సాధించడం పట్ల విద్యాసంస్థల డైరెక్టర్ సీమ, నాగేంద్ర అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐ భాస్కర్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

పరిశోధనలపై దృష్టి అభినందనీయం



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ రవీంద్రనాథ్, అధ్యాపక బృందం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు విద్యార్థులు పరిశోధనలపై దృష్టిసారించడం అభినందనీయమని ప్రిన్సిపల్ రవీంద్రనాథ్ తెలిపారు. బుధవారం కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో జంతుశాస్త్ర విద్యార్థి నిహాంత్ పేపరు ప్రజంటేషన్‌పై బెస్ట్ అవార్డు లభించినందుకు ఆయనను అభినందించారు. విదర్భ మహావిద్యాలయ, బుల్దన గ్లోబల్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆరోగ్యకర జీవితాలు, ఆరోగ్యకర సమాజం, వ్యాధులు వాటి నివారణ, అరికట్టే విధానంపై జంతుశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ వై.సావిత్రి పర్యవేక్షణలో విద్యార్థి నిహాంత్ పత్రసమర్పణ చేశారన్నారు. దీనికి అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. జంతుశాస్త్రం హెచ్‌వోడి డాక్టర్ రవిశేఖర్, అధ్యాపకులు డాక్టర్ నాగేంద్ర, మహేశ్, అపర్ణ, విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రమేశ్, డాక్టర్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కొట్టాడంటూ కరస్పాండెంట్‌ను చితకబాదిన తల్లిదండ్రులు

పులివెందుల టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ ఒక విద్యార్థిని పైశాచికంగా చితకబాదడంతో.. విద్యార్థి తల్లిదండ్రులు కుటుంబసభ్యులతో వచ్చి అతడికి దేహశుద్ధి చేశారు. పులివెందుల పట్టణంలోని పార్నపల్లి రోడ్డు శరణ్య ఆసుపత్రి వెనక అనధికారికంగా ఎక్సలెంట్ నాగార్జున ఇంగ్లీషుమీడియం హైస్కూలు నిర్వహిస్తున్నారు. ఈ విద్యాసంస్థ కరస్పాండెంట్ కుమార్ అదే పాఠశాలలో చదువుతున్న ఏడో తరగతి విద్యార్థి రహీంను చితకబాదాడు. దీంతో బుధవారం విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వచ్చి ఇలా కొడితే ఎలా అని ప్రశ్నించగా అతడు పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. దీంతో ఆగ్రహానికి గురైన విద్యార్థి తల్లిదండ్రులు కరస్పాండెంట్ కుమార్‌పై దాడి చేశారు. పాఠశాలలోని సహ ఉపాధ్యాయులు తల్లిదండ్రులను అడ్డుకుని సర్దిచెప్పి పంపించారు.

ఈ విషయంపై కరస్పాండెంట్‌ను వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. అలాగే సంబంధిత పోలీసుస్టేషన్‌లో సీఐని వివరణ కోరగా, ఈ వ్యవహారం తమదృష్టికి రాలేదన్నారు. కాగా ఈ వీడియో సోషల్ మీడియాలో బుధవారం రాత్రి వైరల్ అయింది. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మత్తు కోసం...

- యువత మాత్రలు, సొల్యూషన్‌ల వినియోగం
- రూ.10 మాత్ర రూ.300కు విక్రయం
- పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ కరువు
- ఇలాగే కొనసాగితే భవిష్యత్తు అంధకారమే



మత్తు కోసం యువత వాడుతున్న ట్యాబ్లెట్లు, ఇంజక్షన్లు



మత్తుకు యువత చిత్తవుతున్నారు. మత్తు వలయంలో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. తెలిసీ తెలియని వయసులో ఫ్యాషన్ పేరుతో.. సినిమాల్లో హీరోలు చేసే మత్తు స్టైల్స్ చూసి వాటిని అనుకరిస్తున్నారు. సరదాగా సిగరెట్లు, మద్యంతో మొదలై క్రమంగా మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారు. అందులో నుంచి బయట పడలేక బానిసలుగా మారుతున్నారు. మద్యం, గంజాయి దొరకని వారు ఇప్పుడు మత్తు కోసం నానా పాట్లు పడుతున్నారు. కొత్తగా మత్తు ట్యాబ్లెట్లను వినియోగిస్తున్నారు. సంప్రదాయ మత్తు పదార్థాలు (మద్యం, గంజాయి) అందుబాటులో లేని వారు ఇతర ప్రమాదకరమైన మత్తు పదార్థాలను వినియోగిస్తూ తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఎక్కువగా 14 నుంచి 22 సంవత్సరాల మధ్యవయస్కులే బానిసలుగా మారుతుండడం గమనార్హం. పరిస్థితి విషమించే వరకు తల్లిదండ్రులకు తెలియకపోవడంతో పలు కుటుంబాలు వేదన పడుతున్నాయి.



ట్యాబ్లెట్ వాడుతున్న యువకునికి కౌన్సెలింగ్ ఇస్తున్న వన్‌టౌన్ సీఐ రామకృష్ణ

కడప (క్రైం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చాలా మంది యువత మత్తు కోసం మద్యం, గంజాయిలాంటి వాటితో పాటు బోనోఫిక్స్‌లాంటి ప్రమాదకరమైన పదార్థాలను వినియోగిస్తూ అనారోగ్యం పాలవుతున్నారు. వాహనాల టైర్ల పంక్చర్లకు ఉపయోగించే సొల్యూషన్ పీలుస్తూ మత్తులో ఊగిపోతున్నారు. కడప నగరంలోని పలు ప్రాంతాల్లో యువకులు వీటికి అలవాటు పడుతున్నారు. అల్మాస్‌పేట, సాయిపేట, నకాశ్, రవీంద్రనగర్, ఖలీల్‌నగర్ వంటి ప్రాంతాల్లో యువకులు ఎక్కువ శాతం ట్యాబ్లెట్లు వినియోగిస్తున్నారు. దీంతో రూ.10లు చేసే మాత్ర రూ.300కు విక్రయాలు జరుగుతున్నాయి. మద్యం, గంజాయిలాంటి అలవాట్లే కాకుండా ఇప్పుడు ఎక్కువగా మత్తు ఎక్కించే ట్యాబ్లెట్లను వినియోగిస్తుండడం గమనార్హం. మెడికల్ స్టోర్‌లే కాదు కొన్ని సెల్‌పాయింట్లలో రూ.10 విలువ చేసే మాత్రలు రూ.300లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకునేవారు ఎక్కువయ్యారు. కడపకు చెందిన ఓ యువకుడు గల్ఫ్ నుంచి కడపకు వచ్చాడు. ఇక్కడ మత్తుకు అలవాటుపడ్డాడు. సమయానికి ట్యాబ్లెట్ అందివ్వలేదని చెప్పి మరో యువకున్ని చావబాదాడు. మత్తులో ఏం చేస్తున్నామో అనే విషయం వారికే అర్థం కాకుండా పోతోంది. కొంత మంది గొడవలకు దిగితే మరికొందరు నిషా మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు.

డాక్టరు ప్రిస్క్రిప్షన్లు లేకుండానే..

ప్రమాదకరమైన మత్తు ట్యాబ్లెట్లు, ఇంజక్షన్లు యువకులు తీసు కుంటున్నారు. వైద్యుల అనుమతి లేకుండానే ట్యాప్ ఫ్రీ ఈఆర్ 50, రెస్టల్ 0.5/0.25 ఎంజీ, క్లోనోట్రిల్ 0.5, ఇలాంటి మాత్రలు వినియోగిస్తున్నారు. అటు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఇటు అధికారులు యువతపై నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని సర్వనాశనం చేసుకుంటున్నారు. నూరేళ్ల జీవితాన్ని మధ్యలోనే చాలించేస్తున్నారు. మత్తుకు అలవాటు పడి అనేక అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. దీనిపై తల్లిదండ్రులు అప్రమత్తమై పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోకపోతే వారి భవిష్యత్తు అంధకారంగా మారుతుంది. ప్రభుత్వ యంత్రాంగం కూడా వీటి వినియోగంపై నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆనందంగా దీపావళి పండుగ చేసుకోవాలి

● అనుమతులు లేని షాపులు సీజ్ ● జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ప్రమాదాలకు తావివ్వకుండా అన్ని జాగ్రత్తలు పాటిస్తూ దీపావళి పండుగను జిల్లా ప్రజలంతా ఆనందంగా చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో దీపావళి పండుగను పురష్కరించుకుని బాణసంచా స్టాళ్ల అనుమతులు, భద్రతా చర్యలు, నిబంధనల పాటింపు తదితర అంశాలపై డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఆర్డీఓలు, సంబంధిత అధికారులతో సమావేశమైన ఆమె మాట్లాడుతూ జిల్లాకు సంబంధించి కడప, పులివెందుల, బద్వేలు, జమ్మలమడుగు డివిజన్‌లలో బాణసంచా దుకాణదారులకు లైసెన్స్ ఇస్తామన్నారు. ధ్వని కాలుష్య నియంత్రణకు అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని రకాల భద్రతా చర్యలు తప్పక పాటిస్తే సాంప్రదాయ పండుగను సంతోషంగా నిర్వహించుకునేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ ఒక్కరూ బాణసంచా దుకాణాలను నిర్వహించకూడదు. నిబంధనలు ఉల్లంఘిస్తే షాపులను సీజ్ చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాళ్లలోనే టపాసులు కొనుగోలు జరగాలన్నారు. అనుమతులు లేకుండా బహిరంగంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే విక్రయదారులపై కేసులు నమోదు చేయాలన్నారు. వాహనాల పార్కింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టంను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్డీఓలు జిల్లాలోని అన్ని బాణ సంచా గోడౌన్లను, స్టాళ్లను పరిశీలించి అనుమతులు, రెన్యువల్స్ ఉండేలా చూడాలన్నారు. తమ పరిధిలో లైసెన్సులు ఇచ్చే ముందు షాపుల వారితో సమావేశం నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేయాలన్నారు. విద్యుత్, అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో ప్రజలు దీపావళి పండుగను సంతోషంగా, సురక్షితంగా చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు కార్యక్రమంలో ఆర్డీఓలు పి.జాన్‌ఇర్విన్, చంద్రమోహన్, సాయిశ్రీ, భానుశ్రీ, నగర కమిషనరు మనోజ్‌రెడ్డి, జిల్లా ఫైర్ అధికారి సాయిధర్మారావు, సమాచారశాఖ ఏడీ వేణుగోపాలరెడ్డి, ఆర్టీసీ రీజనల్ మేనేజరు గోపాల్‌రెడ్డి, కడప తహశీల్దారు నారాయణరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

పీబీఆర్‌లోకి...ఒక టీఎంసీ వరదనీరు



ప్రాజెక్టులోకి చేరుతున్న వరదనీరు

లింగాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పెంచికల బసిరెడ్డి రిజర్వాయర్ (పీబీఆర్)లోకి ఒక టీఎంసీ వరదనీరు చేరినట్లు ప్రాజెక్టు ఈఈ రాజశేఖర్ తెలిపారు. చిత్రావతి నది పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు రెండు రోజుల నుంచి డ్యాంలోకి నీటి చేరిక ప్రారంభమైందన్నారు. 500 క్యూసెక్కుల నుంచి గరిష్టంగా పదివేల క్యూసెక్కుల పైగానే వరదనీరు వచ్చిందన్నారు. బుధవారం సాయంత్రానికి నాలుగువేల క్యూసెక్కుల వరదనీరు చేరుతోందని.. క్రమంగా నీటి ప్రవాహం పడిపోతోందన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.25 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

గండికోట నుంచి 12 వేల క్యూసెక్కులు విడుదల

కొండాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరానికి బుధవారం 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కాగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 6,500 క్యూసెక్కుల కృష్ణాజలాలు, వరద నీరు మరో 3000 క్యూసెక్కులు దాకా వచ్చి చేరుతున్నట్లు డీఈ తెలిపారు. అదేవిధంగా మెయిన్‌కెనాల్‌కు 75 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.32 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ తెలిపారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి వడుదల

మైలవరం అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):మైలవరం జలాశయం నుంచి పెన్నా నదికి పదివేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు మైలవరం జలాశయం డీఈ నరసింహమూర్తి బుధవారం తెలిపారు.గండికోట జలాశయం నుంచి మైలవరానికి నీరు వచ్చి చేరుతుండటంతో పెన్నా నదికి పదివేల క్యూసెక్కులు, ఉత్తర కాల్వకు 30 క్యూసెక్కులు, దక్షణ కాల్వకు 200 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. మైలవరం జలాశయం పూర్తి నీటి నిలువ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం మైలవరం జలాశయంలో 5.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఆటో ఢీ.. మహిళ మృతి

చక్రాయపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమార్లకాల్వ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లవెంకటగాల్ల కమలమ్మ(62) మృతి చెందారు. ఎస్ఐ కృష్ణయ్య వివరాల మేరకు.. కుమార్లకాల్వ హరిజనవాడ వాసి కమలమ్మ వేంపల్లె వైపు వెళ్తున్న టీవీఎస్ మోపెడ్‌లో వేంపల్లెకు వెళ్లేందుకు ఎక్కింది. కొద్ది దూరం వెళ్లగానే వెనుక నుంచి వస్తున్న ఆటో ఢీకొనడంతో ఆమె కిందపడి బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వేంపల్లెకు తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాహనం ఢీ.. ఒకరి మృతి



మృతి చెందిన బాషా

కలసపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శింగరాయపల్లె గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాషా (50) అనే వ్యక్తి మృతి చెందాడు. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన బాషా ద్విచక్రవాహనంలో ఎగువతంబళ్లపల్లె గ్రామంలో వివాహానికి వస్తుం డగా తుఫాను వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కలసపాడు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీ లించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కడప హౌసింగ్‌బోర్డుకాలనీలో చోరీ

కడప క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీలో రవికుమార్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. కరెంటు ఆఫీసులో పనిచేస్తున్న రవికుమార్ ఈనెల 21న కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదు వెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి దొంగలు ఇంటికి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న 50 తులాల బంగారు నగలను అపహరించారు. ఇంటి తాళాలు తెరిచి ఉండడంతో చుట్టుపక్కల వారు రవికుమార్‌కు సమాచారం అందించారు. ఈమేరకు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మట్కానిర్వాహకుడు అరెస్టు

కడప క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మోచంపేట వద్ద మట్కా నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు కడప టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు. ఆయన వివరాల మేరకు మోచంపేటకు చెందిన షేక్ మహ్మద్ ఖాసిం మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారంవచ్చిందన్నారు. కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సిబ్బందితో మట్కా రాస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుండి రూ.14450 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మహిళ మరణానికి కారణమైన వ్యక్తికి ఏడేళ్లు జైలుశిక్ష

కడప క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం బుడ్డాయపల్లె గ్రామంలో అద్దె ఇంట్లో ఉన్న వెంకటేశ్ ఓ మహిళ మృతికి కారణం కావడంతో అతడికి ఏడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌కుమార్ తీర్పునిచ్చినట్లు రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. చిత్తూరు జిల్లా వీకోట మండలం ఎల్లగరం గ్రామానికి చెందిన వెంకటేశ్ జీవనోపాధి కోసం కడపలో నివాసం ఉంటున్నాడు. తిరుపతికి చెందిన ఓ మహిళ చనిపోయేందుకు ప్రేరేపించడంతో పాటు ఆమె చావుకు కారణమైన వెంకటేశ్‌పై 2021లో రిమ్స్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆ కేసుకు సంబంధించి నేరం రుజువు కావడంతో ఏడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు తెలిపారు.

అదుపు తప్పి లోయలో పడిన ట్యాంకర్



సికెదిన్నె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గువ్వలచెరువు ఘాట్‌లో బుధవారం జరిగిన ఆయిల్ ట్యాంకర్ అదుపు తప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలో క్లీనర్‌కు గాయాలయ్యాయి. చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్ నాయక్ తెలిపిన మేరకు వివరాలిలా.. చిత్తూరు నుంచి కడపకు వస్తున్న ఆయిల్ ట్యాంకర్ కడప - రాయచోటి జాతీయ రహదారిలోని గువ్వలచెరువు ఘాట్ దిగుతూ 4వ మలుపు వద్ద అదుపు తప్పడంతో లోయలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో క్లీనర్ కుమరన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అతన్ని హుటాహుటిన కడప రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆకాశవాణిలో నేడు క్షేత్ర దర్శనం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప ఆకాశవాణి కేంద్రం నుంచి ప్రతి గురువారం ఉదయం 7.15 గంటలకు ప్రసారమయ్యే కాంతిరేఖలు కార్యక్రమంలో క్షేత్ర దర్శనం ప్రసారం అవుతుందని స్టేషన్ డైరెక్టర్ మహేశ్ తెలిపారు. ఈనెల 24 నుంచి ప్రతి గురువారం ప్రసారమయ్యే కార్యక్రమంలో కడపకు చెందిన చరిత్ర అధ్యాపకులు ఆధ్యాత్మిక రచయిత డాక్టర్ ఐఎల్ఎన్ చంద్రశేఖర్‌రావు కడప, అన్నమయ్య జిల్లాల్లోని ప్రముఖ ఆలయాల గురించి ప్రస్తావిస్తారని ఆయన తెలిపారు.

కలగానే..గుంజనేరు రక్షణ గోడ



ఉధృతంగా ప్రవహిస్తున్న గుంజనేరు (ఫైల్)

● ఏటా వరదలతో తీవ్ర నష్టం ● కొత్త ప్రభుత్వమైనా కరుణిస్తుందా..? ● ప్రజల ఎదురుచూపు

రైల్వేకోడూరు(రూరల్) అక్టోబరు, (ఆంధ్రజ్యోతి) 23: రాజకీయ క్రీడలో గుంజనేరు రక్షణ గోడ పావులా మారింది. దీంతో వర్షాకాలం వచ్చినప్పుడల్లా రైల్వేకోడూరు ప్రాంత ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. రైల్వేకోడూరుకు ఇరువైపుల గుంజనేరు, ముష్టేరు వాగులు ఉన్నాయి. వర్షాకాలంలో ఈ రెండు వాగులూ ఉధృతంగా ప్రవహించి కొత్త కోడూరు, నరసరాంపేట, గాంధీనగర్ ప్రాంతాలను ముంచేస్తాయి. 2014లో భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇళ్లను అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పరిశీలించారు. వెంటనే వెంటనే ప్రొటెక్షన్ వాల్ నిర్మించాలని ఆదేశించి, నిధులు కూడా విడుదల చేశారు. దీంతో అధికారులు రూ. 20 కోట్లతో కొత్త కోడూరు, రూ 14 కోట్లతో విద్యానగర్ వద్ద ముష్టేరుకు రక్షణగోడ నిర్మించారు. గుంజనేరు రక్షణగోడకు 27 కోట్లు నిధులు మంజూరు కాగా, పనులు ప్రారంభమయ్యేలోపే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పనులను పూర్తిగా రద్దు చేసింది.

దీంతో 2022లో కురిసిన భారీ వర్షాలకు గుంజనేరు పొంగి నరసరాంపేట వద్ద ఉన్న పది ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. దీంతో స్థానిక ప్రజాప్రతి నిధులు గుంజనేరుకు వెంటనే ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో గుంజనేరు రక్షణగోడకు రూ. 38.5 కోట్లు నిధులు మంజూరయ్యాయంటూ అప్పటి రాజంపేట పార్లమెంట్ సభ్యుడు మిథున్‌రెడ్డి హడావుడిగా శంకుస్థాపన చేశారు. కానీ పనులు ముందుకు సాగలేదు. తాము అధికారంలో రాగానే గుంజనేరుకు రక్షణ గోడ నిర్మిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అయితే, కొత్త ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభం కాకపోవడంతో రక్షణగోడ పనులు ఎప్పుడు మొదలవుతాయని నరసరాంపేట, గాంధీ నగర్ వాసులు ప్రశ్నిస్తున్నారు. ప్రజాప్రతినిధులు అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే ప్రొటెక్షన్ వాల్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



నరసరాంపేటలో గుంజనేరు ధాటికి దెబ్బతిన్న ఇల్లు (ఫైల్)

పనులు ప్రారంభించాలి....



గుంజనేరు రక్షణగోడ పనులను వెంటనే మొదలు పెట్టాలి. టీడీపీ హయాంలో రెండు ప్రొటెక్షన్ వాల్స్ నిర్మించారు. వైసీపీ హయాంలో ఎలాంటి పనులు ప్రారంభం కాలేదు. ఎన్నికల సమమంలో హడావుడిగా పనులకు శం కుస్థాపన చేశారు. ప్రజాప్రతినిధులు హామీలు నిలుపుకోవాలి.

- డాక్టర్ సయ్యద్ అహ్మద్, కాంగ్రెస్ నేత

నివేదికను పరిశీలిస్తాం...

గత ప్రభుత్వంలో మంజూరైన గుంజనేరు రక్షణగోడకు సంబంధించిన నివేదికలను పరిశీలిస్తాం, పనులు మొదలు కాని పక్షంలో కాం ట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటాం

- వినోద్‌కుమార్, ఇరిగేషన్ డీఈ

మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డీఆర్‌వోకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగినులు

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగినుల సమస్యలు పరిష్కరించాలని స్టేట్ ఉమెన్ కమిటీ సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి, స్టేట్ అసోసియేట్ చైర్మన్ సైకం శివకుమార్‌రెడ్డిలు కోరారు. బుధవారం రాయచోటి ఎన్జీవో హోమ్‌లో ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ నరసింహ కుమార్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా ఏపీ జేఏసీ ఉమెన్ కమిటీ చైర్‌పర్సన్ ఖాసీంబీ, జనరల్ సెక్రటరీ సాలమ్మ అధ్యక్షతన జిల్లా స్థాయి మహిళా విభాగం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగినుల ఇబ్బందులను తెలియజేసేందుకు అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో షీ బాక్సులు ఏర్పాటు చేయించాలని, అన్ని కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులకు కనీస వసతులు కల్పించేలా జిల్లా స్థాయి అధికారులు బాధ్యతలు తీసుకోవాలని కోరారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం సమర్పించారు

ఏపీఐఐసీ భూముల్లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిప్రతం సమర్పిస్తున్న నాయకులు

రాజంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏపీఐఐసీ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీఎన్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్, పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు పోలి శివకుమార్, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ సిద్దిక్ బుధవారం కలెక్టరుకు వినతి పత్రాన్ని అందజేశారు. తాళ్లపాక చెరువును కబ్జా చేసిన కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవడంతోపాటు ఆ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

లక్కిరెడ్డిపల్లె అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదిమూలం శ్రీనివాసులు అనే వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయి.. అనంతపురం గొల్లపల్లె నుంచి ద్విచక్ర వాహనంలో వెళుతూ కారును తప్పించే యత్నంలో వాహనం అదుపు తప్పడంతో తలకు, శరీరానికి తీవ్రగాయాలు అయ్యాయి .లక్కిరెడిపల్లె హెల్పింగ్ హ్యాండ్ సంస్థ ముజాహిద్ బాషా గాయపడిన వ్యక్తిని వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

చెత్తబుట్టలు పంపిణీ

సిద్దవటం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టక్కోలి గ్రామంలోని బీసీ కాలనీలో 25 మంది మహిళలకు బుధవారం చెత్తబుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సెక్రటరీ శివయ్య మాట్లాడుతూ హరిత రాయబారులు తీసుకువచ్చే గ్రీన్ అంబాసిడర్ వాహనంలో పొడిచెత్త, తడిచెత్త వేర్వేరుగా వేయాలని సూచించారు. గ్రామాలు పరిశుభ్రంగా పెట్టుకోవాలని తెలియజేశారు. గ్రామాల్లో విద్యుత్ దీపాల సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు. గ్రామ సర్పంచ్ పోలుబోయిన లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

సిద్దవటం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో గత ముఖ్యమంత్రి విఫలమయ్యాడని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ కోటపాటి సుబ్బమ్మ విమర్శించారు. ఉప్పరపల్లె గ్రామ పంచాయతీలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి రాయలసీమ ప్రాంత వాసులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆమె తెలియజేశారు.

ఇసుక రీచ్ తనిఖీ



ఇసుకరీచ్‌ను పరిశీలిస్తున్న జేసీ

నందలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టంగుటూరు ఇసుక రీచ్‌ను జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రీచ్‌కు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. రీచ్ నుంచి రోజూ ఎంత ఇసుకను తరలిస్తున్నారు. ఎవరెవరు తీసుకెళుతున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక పాలసీ పక్కాగా అమలు చేయాలని, అవకతవకలకు తావివ్వరాదని అధికారులను ఆదేశించారు.

సమస్యలపై రాష్ట్ర మంత్రికి వినతిపత్రం

సిద్దవటం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భూ సమస్యలపై రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు బుధవారం పంచాయతి చాంబర్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రిని కలిసిన ఆయన గత వైసీపీ ప్రభుత్వంలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో నిరుపేదల ఇళ్ల స్థలాలు, భూములను అన్యాక్రాంతం చేశారని, వాటిపై సమగ్ర విచారణ చేయించాలని కోరారు.

మంగంపేటలో రక్షకదళం ఆవిర్భావ దినోత్సవం

ఓబులవారిపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక రక్షక దళాల ఆవిర్భావ దినం సందర్భంగా ఎస్ఐ శివ ఆధ్వర్యంలో మంగంపేట ఏపీఎండీసీ సంస్థలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీఎఫ్‌డీజీ త్రివిక్రమ్‌వర్మ, ఐజీ బీవీ రామిరెడ్డి, తిరుపతి డివిజన్ కమాండెంట్ డీఎస్‌కే రాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సంస్థలకు భద్రత కల్పిస్తూ తమ సంస్థ ఎన్నో అవార్డులను సొంతం చేసుకున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ విశ్వనాథ, ప్రత్యేక రక్షక విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల తీరుతోనే దళితులపై దాడులు

ఓబులవారిపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ అధికారుల అలసత్వమే పి.కమ్మపల్లె హరిజనవాడ దళితులపై దాడులకు కారణమని టీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, జయరామయ్య మండిపడ్డారు. సోమవారం జరిగిన దాడిలో గాయపడి రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దళిత రైతులను బుధవారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులకు ప్రభుత్వం మంజూరు చేసిన భూములను అగ్రవర్ణాలవారికి అప్పగించేందుకు రెవెన్యూ అధికారులు సహకరించడమే దళితులపై దాడులకు కారణమన్నారు. జిల్లా యంత్రాంగం రెవెన్యూశాఖ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని, ఎన్డీయే నాయకులు ఎస్సీ ఎస్టీ పేదలకు అండగా నిలవాలని లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

సంక్షేమ హాస్టల్ తనిఖీ

చిన్నమండెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు ప్రభుత్వం అమలుచేస్తున్న అన్ని వసతులు కల్పించాలని జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి వసతిగృహ అధికారులకు సూచించారు. బుధవారం సాయంత్రం ఆయన చిన్నమండెం ఎస్సీ బాలుర హాస్టల్‌ను తని ఖీ చేశారు. తరగతి గదులు, నిద్రించే గదులు, వంట గదులు, స్టోర్‌రూమ్, బాత్‌రూంలు తనిఖీ చేశారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకుని రావాలని విద్యార్థులకు సూచించారు. సంబంధిత అధికారులకు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

బోరు, మోటారు ప్రారంభం

రాయచోటిటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డీ. అబ్బవరం గ్రామం కమ్మపల్లి, నక్కలవాండ్లపల్లెలో బుధవారం మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి నూతన బోరు మోటార్లను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో ప్రతి గ్రామంలో బోరు వేసి మోటారు బిగించి నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో ఎక్కడ కూడా నీటి సమస్య ఉండకూడదనే ఉద్దేశంతో కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా ఉండాలి

వీరబల్లి, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా ఉండాలని ఏరియా కోఆర్డినేటర్ కొండా శ్రీనివాసులరెడ్డి సూచించారు. బుధవారం వెలుగు కార్యాలయంలో నిర్వహించిన మండల మహిళా సమాఖ్య కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాఖ్యలో ప్రతినెల జరిగే లావాదేవీలు సభ్యులందరికీ వినిపించి తీర్మానించాలని తెలిపారు. సామాజిక పెట్టుబడి నిధి, స్త్రీనిధి రుణాల బకాయిలు వెంటనే వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఖాదర్ వలి, సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కార్యదర్శి గులాబ్‌జాన్, ఉపాధ్యాయురాలు వారాధమ్మ, సీసీలు కృష్ణ, నాగేంద్ర, సుధాకర్, గంగాధర, సభ్యులు పాల్గొన్నారు.

సాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలి

రాయచోటిటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలని మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గాండ్లపెంట ఖాదర్‌బాషా సూచించారు. బుధవారం మాసాపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో నైతిక విలువలపై అవగాహన కల్పించారు. మానవత సంస్థ సెక్రటరీ అంకం జయచంద్రారెడ్డి, చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి




మాట్లాడుతున్న జిల్లా మహిళా సంరక్షణ సీఐ రవిశంకర్

వీరబల్లి, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): అరాచకాలు దృష్టిలో ఉంచుకొని ఆడపిల్లల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మహిళా సంరక్షణ సీఐ రవిశంకర్ హెచ్చరించారు. బుధవారం నూజివీడు పంచాయతీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గుడ్ నైబర్స్ ఏపీ కోర్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా బాలికలను ప్రేమ పేరుతో వేధిస్తుం టే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ ప్రభావతి మాట్లాడుతూ ఒంటరి మహిళల సంరక్షణ, వన్‌స్టాప్ సెంటర్ అవశ్యకతను వివరించారు. గుడ్ నైబర్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ నాగేశ్వర్ చదువురాని బాలికల సంరక్షణ బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా అంశాలను వివరిం చారు. ప్రధానోపాధ్యాయుడు మనోహర్‌రెడ్డి, సంస్థ కోఆర్డినేటర్ బాలు, బాలల సంరక్షణ అధికిరి రవి, రామలక్ష్మి, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మాతమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

ఒంటిమిట్ట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అరుంధతివాడలో బుధవారం మాతమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అర్చకుడు ఏలేశ్వరం గురుస్వామి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దఎత్తున అన్నదానం చేశారు.

గుంజనేరుకు సోమశిల జలాలు



గుంజనేరులోకి చేరుతున్న సోమశిల జలాలు

పెనగలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సోమశిల ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నర్సిం గరాజపురం వద్ద గుంజనేరు లోకి భారీగా చేరుతోంది. అక్కడి నుంచి నెమ్మదిగా వెల గచర్ల సమీపంలోని ప్రధాన అలుగు వద్దకు చేరుతోంది. దీంతో నర్సింగరాజపురం, సిరి వరం, కిరణంపల్లి, రెడ్డివారిపల్లె, కొండూరు, కేసీ అగ్రహారం, ఉప్పరపల్లె, వీఎం పురం, వెలగచర్ల వరకు గుంజనేరుకు ఇరువైపులా భూగర్భ జలాలు పెరుగుతాయని రైతులు భావిస్తున్నారు. వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులకు సోమశిల జలాలు కొంత ఊరటనిస్తున్నాయి. ఇదిలా ఉండగా న ర్సింగరాజపురం వద్ద ఉన్న కాజ్‌వేపై నీరు చేరడంతో చుక్కాయపల్లె, సాప రోపల్లె, సిరివరం, కిరణంపల్లి, కొండూరు గ్రామాలకు రాకపోకలు ఆగిపో యాయి. ఈ గ్రామాల ప్రజలు ఈటమాపురం నుంచి మండల కేంద్రానికి చేరుకుంటున్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చర్యలు

సిద్దవటం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చర్యలు తప్పవని తహసీల్దారు మురాద్వావలి హెచ్చరించారు. సిద్దవటం మండలం శాఖరాజుపల్లి గ్రామ పంచాయతీ మోహిద్దీన్‌సాహెబ్ గ్రామంలో బుధవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సామ శ్రీనివాసులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో శాఖరాజుపల్లి రెవెన్యూ పొలం సర్వేనంబరు 459/1, 427/1 సుమారు 10 ఎకరాల భూమి కబ్జాకు గురైందని ఫిర్యాదు చేశాడు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శివశంకర్, సర్పంచ్ శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గృహ హింస నేరం

సుండుపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గృహ హింస, లైంగిక వేధింపులు నేరమని వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ అత్తర్‌ఫీమా అంజుమ్ తెలిపారు. బుధవారం మండలంలోని రాయవరం సెక్టార్‌లో అంగన్వాడీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు చేసినా, చేస్తున్నట్లు తెలిసిన పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పోక్సో యాక్ట్, షి బాక్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, కార్యకర్తలు పాల్గొన్నారు.

రికార్డులు లేని వాహనాల యజమానులకు జరిమానా..

రాజంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : లైసెన్సులు, ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను రాజంపేట మోటారు వాహనాల తనిఖీ అధికారి బి.వినోద్‌కుమార్ పట్టుకుని వాటి యజమానులకు రూ.7.73 లక్షల జరిమానా విధించారు ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఆర్సీలు, ఇన్సూరెన్సులు ఇతర అనుమతి పత్రాలు లేని వాహనాలపై కేసులు నమోదు చేయడంతోపాటు, సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరం

ఒంటిమిట్ట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఎస్ఐ శివప్రసాద్ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా బుధవారం కొత్తమాధవరంలోని జడ్పీ హైస్కూల్లో విద్యార్థులతో సందర్భంగా పోలీసులు ప్రజలకు అందిస్తున్న సేవలను, పోలీసు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నిరంతరం ప్రజలకు రక్షణగా పోలీసులు పనిచేయడం జరుగుతుందని, సేవాభావంతో ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా పోలీసులు పాత్ర ఉంటుందని వివరించారు. శాంతిభద్రత పరిరక్షణ కోసం పోలీసులు విరామం లేకుండా పని చేస్తారని ఆపద సమయంలో పోలీసులను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు. గురువారం పాఠశాలలో 9. 10 తరగతుల విద్యార్థులకు పోలీసు అమరలవీరులపై వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీ

సిద్దవటం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా పరిషత్ హైస్కూల్లో 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విజేతలుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి కడప జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళతామన్నారు.

స్టడీ మెటీరియల్ వితరణ

పుల్లంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని టి.కమ్మపల్లె గ్రామంలో ఉన్న గ్రంథాలయానికి స్థానికుడు ముమ్మినేని సుబ్బరాయుడు బుధవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ స్టడీ మెటీరియల్ ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణారెడ్డి సూచించారు. గ్రంథాలయ నిర్వాహకుడు శ్రీను, ఉపాధ్యాయులు సయ్యద్‌సర్తాజ్ హుస్సేన్, బాలనరసింహులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయురాలికి సన్మానం

నందలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్కూల్‌గేమ్ ఫెడరేషన్ పోటీల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దినందుకు మండలంలోని నాగిరెడ్డిపల్లె జడ్పీ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయురాలు నల్లబోయిన గౌరిని బుధవారం ప్రధానోపాధ్యాయురాలు జయలలితకుమారి, మండల విద్యాశాఖ అధికారి నాగయ్య, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన సయ్యద్ ఉమర్,ఉస్మాన్ అలీ (షాట్‌పుట్) సూరేపల్లి ప్రణీత్ (యోగా), సంజాపురి హర్షవర్ధన్, సయ్యద్ ఉమర్, ఉస్మాన్ అలీ (కబడ్డీ)ని జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

పాఠశాలలకు యాసిడ్, ఫినాయిల్ పంపిణీ

పెనగలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు, వంటగదులను శుభ్రం చేసేందుకు అవసరమైన రసాయనాలను ప్రభుత్వం ఎంఈవో కార్యాలయానికి పంపించిందని ఎంఈవో-1 గిరి వదరయ్య, ఎంఈవో-2 నాగసుబ్బరాయుడు తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది వచ్చి వాటిని తీసుకెళ్లాలని తెలిపారు.

వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి



రైల్వేకోడూరు: మీడియా సమావేశంలో మాట్లాడుతున్న దార్ల రాజశేఖర్

రైల్వేకోడూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం రైల్వేకోడూరు సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థను కొనసాగించడంతోపాటు, వేతనాన్ని 10 వేలకు పెంచుతామని కూటమి నాయకులు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా ఇంత వరకు వలంటీర్లను పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఏరియా నాయకులు శెట్టిపల్లె పెంచలయ్య, సీపీఐ మండల సహాయ కార్యదర్శి మొగిలి వినయ్, ఏఐవైఎఫ్ నాయకులు మోడి శశికుమార్ పాల్గొన్నారు.

గాలివీడు: వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్ డిమాండ్ చేశారు. బుధవారం దళిత హక్కుల పోరాట సమితి మండలశాఖ అధ్యక్షుడు చుక్క వీరభద్రయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఇచ్చిన వాగ్దానం ప్రకారం బేషరతుగా వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకోవాలని, అలా చేయని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. రామాంజనేయులు, ప్రసన్నాంజనేయులు, హరినాథ, సురేశ్‌బాబు, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

పేద మహిళకు సాయం

రైల్వేకోడూరు, అక్టోబరు 23:(ఆంధ్రజ్యోతి) పట్టణానికి చెందిన పేద మహిళ వీణావతి భర్త చనిపోయి ఇబ్బందులు పడుతున్నారని రైల్వేకోడూరు మండల అభివృద్ధి అధికారి నాగార్జునరావు ఒక బియ్యం బస్తా, విజయవాడకు చెందిన రమేష్ అనే వ్యక్తి రూ. 2500లు విలువ చేసే నిత్యావసర వస్తువులను బుధవారం గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ కె. పార్థసారథి పంపిణీ చేశారు

పాఠశాలకు గ్రిల్ ఏర్పాటు

రాయచోటి టౌన్, అక్టోబరు 23 (ఆంధ్ర జ్యోతి): గ్రామ ప్రజల ఆర్థిక సహకారంతో సిద్దారెడ్డిగారిపల్లె మండల పరిషత్ ప్రాథ మిక పాఠశాల ముందు భాగంలో గోడ నిర్మాణంతో పాటు, ఇనుప గ్రిల్ ఏర్పాటు చేసినట్లు ఉపాధ్యాయుడు మహమ్మద్‌అలీ తెలియజేశారు. ఇందుకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యా కమిటీ చైర్మన్ ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ రమేశ్, మెంబర్ చెన్నకేశవులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పాఠశాల అభివృద్ధిలో ఊరి ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు.

తాగునీరందించి ఆదుకోండి



కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మైనార్టీ మహిళలు

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తాగునీరందించి ఆదుకోవాలంటూ చెన్నముక్కపల్లె గ్రామ పంచాయతీ రాజుల కాలనీకి చెందిన మహిళలు బుధవారం కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. రాయచోటి మున్సిపాలిటీని ఆనుకుని ఉన్న ఈ కాలనీలో దాదాపు 500 మంది నివాసముంటున్నారు. ఈ కాలనీలో ఐదేళ్ల క్రితం వేసిన బోరు చెడి పోయి దాదాపు ఆరు నెలలు కావస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని వాపోయారు. ఈ విషయం పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయాల్లో ఎన్నో సార్లు ఫిర్యాదు చేశామన్నారు. గుక్కెడు నీళ్ల కోసం పుట్టెడు కష్టాలు పడుతున్న మా బాధలు వినే వారు కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగారు.

రాయచోటిటౌన్: నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి ఆర్డీవో రంగస్వామికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాజుల కాలనీలో తాగునీరు లేక పోవడంతో ట్యాంకర్లతో నీరు కొనుగోలు చేస్తున్నామన్నారు. చెన్నముక్కపల్లెను మున్సిపాలిటీలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.

చెక్‌డ్యాం తెగిపోవడంతో నీరంతా వృథా..

సుండుపల్లె, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని మడితాడు పంచాయతీ కొలిమిట్ట సమీపంలోని మద్దెలవంక చెక్‌డ్యాం తెగిపోయింది. చాలా కాలం క్రితం నిర్మించిన చెక్‌డ్యాం ప్రవాహ ఉధృతికి తట్టుకోలేక బుధవారం కొట్టుకుపోయిందని రైతులు తెలిపారు. వెంటనే మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



భవానీనగర్‌లోని మద్యం దుకాణం ఎదుట గ్రామస్తుల ధర్నా

నివాసాల మధ్య దుకాణం వద్దే.. వద్దు...

● మద్యం దుకాణం ఎదుట ప్రజల ధర్నా

మదనపల్లె టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తున్నారని, గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. బుధవారం మదనపల్లె మండలం తట్టివారిపల్లె పంచాయతీ భవానీనగర్ వద్ద ఏర్పాటు చేసిన దాము వైన్స్ ఎదురుగా ప్రజలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవానీనగర్‌లో నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేశారని, ఇక్కడ మద్యం కొనుగోలు చేసిన వ్యక్తులు పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోనే మద్యం తాగి ఆ మత్తులో గొడవలు చేస్తున్నారన్నారు. ఈ విషయమై ఇప్పటికే సీఎం చంద్రబాబు పేషీకి, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్రకు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌కు, సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదులు పంపామన్నారు. అధికారులు స్పందించి నివాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వేరొక చోటికి తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం కృష్ణ, గౌస్‌మోదీన్, రషీదా, అయాజ్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

● ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఎదుట నిరసన

రైల్వేకోడూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నివాసాల మధ్య మద్యం దుకాణం వద్దని ప్రజలు బుధవారం ర్యాలీగా వెళ్లి ఎక్సైజ్ శాఖ సీఐ కార్యాలయం ఎదుట జనసేన, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, జనసేన నాయకులు ముత్యాల కిషోర్, నాగోలు అమర్‌నాథ్ మాట్లాడుతూ రాంనగర్, ఒంటెలనగర్ మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని అక్కడ నుంచి వేరే చోటికి తరలించాలని డిమాండ్ చేశారు. మద్యం దుకాణానికి సమీపంలో ప్రభుత్వ మెయిన్ పాఠశాలతో పాటు కళాశాల కూడా ఉందన్నారు. మద్యం దుకాణాన్ని ఆనుకుని కళాశాల, స్కూలుకు విద్యార్థులు వెళ్లవలసి ఉందన్నారు. మహిళలు తిరుగుతుంటారని తెలిపారు. మద్యం దుకాణాన్ని ఇక్కడి నుంచి తొలగించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందన్నారు. అనంతరం రైల్వేకోడూరు ఎక్సైజ్ శాఖ సీఐ తులసికి వినతిపత్రం సమర్పించారు. మద్యం దుకాణాన్ని పరిశీలిస్తామని సీఐ తెలిపారు.


ఎక్సైజ్ శాఖ సీఐ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రజలు

సమాజ సేవకులు...

● నిరుపేదలకు ఆసరా..సహారా.. ● మానవత్వం చాటుతున్న యువత

వాల్మీకిపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సొంత ఊరికి ఏదో చేయాలన్న తపన.. తమకు ఉన్నంతలో తోటివారికి సాయం చేయాలన్న సేవా గుణం..నిరుపేదలకు అండగా నిలవాలన్న సంకల్పం..సేవే మార్గం సేవే లక్ష్యంగా..మానవత్వం చాటుతున్న ఆ యువకులు ఎందరికో ఆదర్శంగా నిలిచారు. వాల్మీకిపురం పట్టణానికి చెందిన యువత సహారా ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి పేదలకు ఆసరాగా ఉంటూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, మరికొందరు ప్రభుత్వ కొలువులు, ఇంకొందరు చిరు వ్యాపారులు.. ఇలా పట్టణానికి చెందిన సాదిక్‌అహ్మద్, జమీల్, ఇక్బాల్, షాహిద్, రహంతుల్లా, అయ్యప్ప, బావాజాన్, నిరంజన్, కలందర్, ఖదీర్, సయ్యద్‌బాషా, అష్రఫ్, ఆషర్, ఇర్ఫాన్, నవాజ్, ఇమ్రాన్, జహీర్, మహ్మద్, సుల్తాన్, ప్రసాద్, ఈషాన్ తదితర 15 మందికి పైగా స్నేహితులు వివిధ రంగాలలో రాణిస్తున్నారు. ఈ మిత్ర బృందం అంతా కలిసి సేవాగుణంతో జట్టుగా ముందుకొచ్చారు. 2011వ సంవత్సరం జూలై 2న సహారా ఛారిటబుల్ ట్రస్టును నెలకొల్పారు. ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమాలతో పేదలకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. వాల్మీకిపురం మండలం వ్యాప్తంగా సుమారు 270కి పైగా నిరుపేద కుటుంబాలను ఎంపిక చేసుకుని సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ట్రస్టు ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఈ మిత్ర బృందం సుమారు రూ.60 లక్షలకు పైగా నిధులు పోగు చేసుకుని వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఎవరినీ సహాయం అడగకుండా ట్రస్టు సభ్యులే తమ సొంత డబ్బులతో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

ఆదర్శం


అంత్యక్రియల్లో ట్రస్టు సభ్యుల సహాయక చర్యలు (ఫైల్)

తోటి వారిని ఆదుకోవడంలోనే సంతృప్తి..



మనకున్నంతలో తోటి వారికి సాయం అందించి ఆదుకోవడంలో నిజమైన సంతృప్తి కలుగుతుంది. స్నేహితులంతా కలిసి సేవే పరమావధిగా సహారా ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి నిరుపేదలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నాం. సేవా కార్యక్రమాల ద్వారా పెద్దల అభినందనలు, ఆశీర్వాదాలు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తున్నాయి. ప్రస్తుత సమాజంలో నిస్వార్థ సేవతో నిరుపేదలకు సాయపడే గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నదే మా మిత్ర బృందం విజ్ఞప్తి.

- సాదిక్‌అహ్మద్, సహారా ఛారిటబుల్ ట్రస్టు, అధ్యక్షుడు, వాల్మీకిపురం

సహారా సేవలివీ..

- పేద కుటుంబాలలో యువతుల పెళ్లి ఖర్చుల కోసం రూ.5 లక్షల వరకు ఆర్థిక సాయం.
- స్థానిక నాయక్‌వీధికి చెందిన రెహమాన్ (41) ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతుండగా అతడికి వైద్య ఖర్చులకు రూ.2 లక్షల ఆర్థికసాయం అందించారు.
- కరోనా కష్టకాలంలో 9 0రోజుల పాటు ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం.
- మండలంలోని గండబోయనపల్లెకు చెందిన చిన్నారి తెహరీన్ (8), సయ్యద్‌బాషాలు అనారోగ్యంతో బాధపడుతుండగా రూ.45 వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు.
- 200 నిరుపేద కుటుంబాలను ఎంపిక చేసి ప్రతి ఆదివారం రెండు కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ.
- మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 60 మందికి శస్త్ర చికిత్సలు చేయించారు.
- కొవిడ్ మృతులకు ట్రస్టు ఖర్చులతో అంత్యక్రియలు.
- ప్రతి ఏటా నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ.
- క్షయ వ్యాధితో బాధపడుతున్న ఆరుగురు రోగులకు వైద్య ఖర్చులతో పాటు నిత్యావసర సరుకుల పంపిణీ.


నిత్యావసర సరుకులు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు


అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న ట్రస్టు బృందం (ఫైల్)

జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపిక

రైల్వేకోడూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన రైల్వేకోడూరు నారాయణ స్కూలు విద్యార్థినులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 6, 7, 8 తేదీల్లో తిరుపతిలో జరిగిన పోటీల్లో నారాయణ స్కూలుకు చెందిన వై.లాస్య, పి.పవన్, రూపశ్రీ, ఎస్.మేధ ప్రతిభ ప్రదర్శించారు. త్వరలో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ప్రిన్సిపాల్ వెంకటసుధీర్ వివరించారు. ఆయా విద్యార్థినులను ఎస్ఐ నవీన్‌బాబు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఐ నవీన్‌బాబు

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు జాండ్రపల్లె విద్యార్థి

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు జాండ్రపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థి రాజేంద్ర ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 22న కడప మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన అండర్-17 క్రికెట్ విభాగంలో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. వ్యాయాయ ఉపాధ్యాయుడు చక్రపాణి, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.



రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు...

సంబేపల్లె, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు దేవపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పావని, గంగాదేవి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఫిజికల్ డైరెక్టర్ తెలిపారు. కడప మున్సిపల్ స్టేడియంలో ఈనెల 22న జరిగిన బాలికల అండర్-17 కబడ్డీ పోటీలో పావని, అండర్-14 విభాగంలో గంగాదేవి ప్రతిభ ప్రదర్శించారని వివరించారు. ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు రాయచోటిలో అండర్-17 పోటీలు నవంబరు 1 నుంచి 11 వరకు బాపట్ల జిల్లాలో అండర్-14 పోటీలు జరుగుతాయన్నారు.


రాష్ట్ర స్థాయికి ఎంపికైన పావని, గంగాదేవి

జిల్లా స్థాయి క్రీడల్లో జ్యోతిబాపూలే విద్యార్థుల ప్రతిభ

నందలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన ఆటల పోటీల్లో మహాత్మా జ్యోతిబాపూలే సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటారని ప్రిన్సిపాల్ నాగేశ్వరి తెలిపారు. అండర్-19 200 మీటర్ల పరుగులో పి.వర్షిత, 1500 మీటర్లలో హేమలత, ఫోర్‌కే పరుగులో కె.ఆశ, డిస్క్ త్రోలో ఎస్.నిత్య, జావెలిన్ త్రోలో ఎం.యోగిప్రభ, షాట్‌పుట్‌లో ఎస్.నిత్య, ఖోఖోలో పి.సాయి హారిక, ఎస్.నిత్య, పి.వర్షిత, కె.ఆశ, పి.వనిత, క్రికెట్‌లో సి.హేమలత, చెస్‌లో ఎస్.పవిత్ర, హ్యాండ్‌బాల్‌లో కె.ప్రతిభ, ఎస్.నిత్య, త్రోబాల్‌లో కె.ప్రతిభ, టెన్నికాయిట్‌లో బి.గ్రీష్మ, జి.మాధురి, వాలీబాల్‌లో టి.తేజ, అండర్-17 విభాగం కబడ్డీలో ఎం.అమృత, క్యారమ్స్‌లో సి.రేఖ, క్రికెట్‌లో వి.భవ్యశ్రీ, అండర్-14 కబడ్డీలో వై.సంజీవ, క్యారమ్స్‌లో ఎల్.దివ్యశ్రీలు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.


ఎస్‌జీఎఫ్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థినులు

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థిని

పుల్లంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థిని జాస్మిన్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లీలా శ్రీహరి, పీడీ నీలకంఠరావు తెలిపారు. బుధవారం వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 హాకీ సెలక్షన్స్‌లో తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జాస్మిన్ ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.


విద్యార్థిని జాస్మిన్‌తో పీడీ నీలకంఠరావు

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కురబలకోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : డిప్లొమా చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన బుధవారం మండలంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పిచ్చలవాండ్లపల్లె పంచాయతీలోని ప్రైవేట్ అగ్రికల్చర్ డిప్లొమా కళాశాలలో గుర్రంకొండకు చెందిన విద్యార్థి రాఘవేంద్ర చదువుతున్నాడు. కాగా ఏమి జరిగిందో తెలియదు కానీ బుధవారం తను చదువుతున్న కళాశాలలోనే విద్యార్థి చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన తోటి విద్యార్థులు చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స అందించారు. కాగా విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి ప్రేమ వ్యవహారమే కారణమని పలువురు విద్యార్థులు చెబుతున్నారు. ఈ మేరకు సమాచారాన్ని ఆసుపత్రి ఔట్‌పోస్టు సిబ్బంది ముదివేడు పోలీసులకు అందించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చికిత్స పొందుతున్న రాఘవేంద్ర

'రంగోత్సవం'లో గురుకుల పాఠశాలకు అవార్డులు

కలికిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ కేంద్రంగా ఏటా జాతీయ స్థాయిలో విద్యార్థుల మధ్య జరిగే సృజనాత్మక కళలపై జరిగే పోటీలో ఈ ఏడాది స్థానిక జ్యోతిభాపూలే బాలికల గురుకుల పాఠశాలకు బహుమతుల పంట పండింది. గత జూలై నెలలో జరిగిన పోటీల్లో ఈ పాఠశాల నుంచి మొత్తం 80 విద్యార్థినులు పాల్గొన్నారు. అందులో 24 మందికి వివిధ రకాల అవార్డులు లభించాయి. వాటిని బుధవారం నిర్వాహకులు పాఠశాలకు పంపించారు. ఆర్ట్ మెరిట్ కేటగిరీలో 10వ తరగతి చదువుతున్న వి.కావ్యశ్రీ ప్రథమ బహుమతి సాధించింది. హ్యాండ్ రైటింగ్ విభాగంలో పదో తరగతి విద్యార్థిని ఎల్.అంజలికి కన్సొలేషన్ బహుమతి లభించింది. ఇవి కాకుండా డ్రాయింగ్, థంబ్ పెయింటింగ్, కార్టూన్ మేకింగ్, హ్యాండ్ రైటింగ్, గ్రీటింగ్ కార్డు తయారీ, కేరికేచర్ పోటీల్లో మరో 22 మంది అవార్డులు పొందారు. ఇందులో 10 మంది విద్యార్థినులకు గోల్డ్ మెడల్స్, 8 మందికి సిల్వర్ మెడల్స్, నలుగురికి కాంస్య పతకాలు అందాయి. గరిష్ఠ సంఖ్యలో విద్యార్థినులు బహుమతులు సాధించిన కారణంగా 'బెస్ట్ స్కూల్ ఫర్ ఫ్యూచరిస్టిక్ ఎడ్యుకేషన్' అవార్డు గురుకుల బాలికల పాఠశాల దక్కించుకుంది. పాఠశాల నిర్వహణలో ప్రతిభను కనబరిచిన ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ కూడా ప్రశంసాపత్రం, జ్ఞాపికను పొందారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రంగోత్సవం నిర్వాహకులు పంపిన మెడల్స్, ప్రశంసాపత్రాలను విజేతలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సోమశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


విద్యార్థినికి అవార్డు పంపిణీ చేస్తున్న సోమశేఖర్

రైతాంగాన్ని ఆదుకుంటాం

● ఎంఎస్ఎంఈని జిల్లాకు రప్పిస్తాం ● కాంట్రాక్టు కార్మికుల శ్రమదోపిడీని సహించం
● అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి ● జడ్పీ సమావేశంలో ప్రజాప్రతినిధులు

(5వ పేజీ తరువాయి)

సీకేదిన్నె జడ్పీటీసీ సభ్యుడు నరేన్ రామాంజుల రెడ్డి ప్రశ్నించారు. ఈ విషయంపై ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం వారి మేనిఫెస్టోను తుంగలో తొక్కిందన్నారు. ప్రతి ఏడాది ఉద్యోగాల భర్తీ అని జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేసారే కాని ఉద్యోగాల భర్తీ మాత్రం జరగలేదన్నారు. ఇక పోతే అమ్మ ఒడిని 2019లో ఇవ్వకుండా వంచనచేసింది మీరు కాదా అని ప్రశ్నించారు.

అజెండాపై ఫైర్

జడ్పీ సర్వసభ్య సమావేశం అజెండాపై టీడీపీ ప్రజాప్రతినిధులు వరదరాజులరెడ్డి, రామగోపాల్‌రెడ్డి ఫైర్ అయ్యారు. అజెండా ఇవ్వకపోతే తాము ఏమి మాట్లాడాలని ప్రశ్నించారు. జడ్పీ డిప్యూటీ సీఈవో మైథిలి మాట్లాడుతూ అజెండాను సభ్యులకు రిజిస్టర్ పోస్టు చేశామని అనగా ఎందుకు అబద్ధాలు చెబుతున్నారు.. అజెండా పంపినట్లు నిరూపిస్తే తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని రామగోపాల్‌రెడ్డి ఘాటుగా మాట్లాడారు. మీ కోరిక మేరకు పంపుతామని మైథిలి పేర్కొనగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పంపడం తప్పనిసరి అన్నారు. సమావేశం ఉదయం 10 గంటలకని 11 గంటలకు ప్రారంభించడం ఏ సంప్రదాయమని చురకలంటించారు. ఈసారైనా సమావేశాన్ని అనుకున్న సమయానికి ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను రానున్న సమావేశం నాటికి పరిష్కరించాలన్నారు. ఈ సారి సమావేశంలో చర్చకు జడ్పీ శాఖను కూడా చేర్చాలన్నారు.

ఎవరేమన్నారంటే..

జడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రజాసమస్యలపై వాడీవేడీ చర్చ కొనసాగింది. అజెండా అంశాలవారీగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను వినిపించగా పలువురు సభ్యులు లెవనెత్తిన అంశాలపై అధికారులు సమాధానమిచ్చారు.

- అక్టోబర్ 23న క్యాబినేట్ సమావేశం ఉందని ముందే తెలుసుకదా.. మంత్రులు లేరు సీఈవో లేరు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఎవరిస్తారని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు.
- జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం చిన్నకొమెర్ల గ్రామంలోని వంక సమీపంలో దాల్మియా యాజమాన్యం సిమెంట్ ఫ్యాక్టరీని 2006లో ఏర్పాటుచేసిందన్నారు. దీని కారణంగా వంకకు వరద వచ్చినప్పుడు నీరు ప్రవహించడానికి వీలులేకుండా ఉండడం వలన సమీపంలోని ఎస్సీకాలనీ, నవాబ్‌పేటతో పాటు 400 ఎకరాలు ముంపునకు లోనవుతోందని బాధిత రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు.
- రాజంపేట నియోజకవర్గంలోని అన్నమయ్య ప్రాజెక్టుకు పునర్‌నిర్మించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి తగిన నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి కోరారు. ప్రాజెక్టు నిర్మాణం జరిగితే అక్కడి ప్రజలకు తాగురు, రైతాంగానికి సాగు నీరు అందుతుందన్నారు.
- రాష్ట్రప్రభుత్వం రైతులకు సబ్సిడీద్వారా అందిస్తున్న విత్తనాలు బయటి మార్కెట్ కన్నా అధిక రేట్లు ఉన్నాయని పెండ్లిమర్రి, సీకేదిన్నె, కమలాపురం జడ్పీటీసీలు పిట్టుబాలయ్య, నరేన్‌రామాంజులరెడ్డి, వీఎన్‌పల్లె ఎంపీపీ రఘునాథరెడ్డి పేర్కొన్నారు.
- వీరపునాయునిపల్లె మండలంలో ఇద్దరు ముగ్గురు వీఆర్‌వోలు మాత్రమే ఉన్నారని ఈ కారణంగా మండలంలో రెవెన్యూసేవలు పూర్తి స్థాయిలో అందడంలేదని ఎంపీపీ అన్నారు. అలాగే గంగిరెడ్డిపల్లెను రెవెన్యూ విలేజ్‌గా మార్చాలని, వెబ్‌ల్యాండ్‌లో ఆ గ్రామమే చూపడంలేదని తెలిపారు.
- ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు విషజ్వరాల బారిన పడి అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వ ఆసుపత్రులలో వందశాతం కాన్పులు జరిగేలా చూడాలని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. పోరుమామిళ్ల పీహెచ్‌సీలో వైద్యుల కొరత ఉందని ఉన్న కొద్దిపాటి సిబ్బంది కూడా సమయపాలన పాటించడంలేదని జడ్పీటీసీ చెన్నయ్య తెలిపారు. చెన్నూరు పీహెచ్‌సీని సీహెచ్‌గా మార్చినప్పటికి తగినంతమంది వైద్యులు లేరని సాయంత్రం 4 గంటలకే తాళాలు వేసుకుని వెళ్తున్నారని ఎంపీపీ తెలిపారు.
- పశువుల దాణా రేటును తగ్గించి పాడిరైతులను ఆదుకోవాలని పెండ్రిమర్రి, చక్రాయపేట జడ్పీటీసీలు పిట్టుబాలయ్య యాదవ్, శివప్రసాదొరెడ్డి కోరారు.
- జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని వెంటనే భర్తీ చేసి 10వ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఎమ్మెల్సీతో పాటు పెండ్లిమర్రి జడ్పీటీసీ బాలయ్య యాదవ్ కోరారు. కమలాపురం బ్రిడ్జి పనులను త్వరలో పూర్తిచేయాలని, చిన్నచెప్పలి నుంచి సంగమేశ్వర దేవస్థానం రోడ్డు పనులను పూర్తిచేయాలని, కమలాపురంలో ఇండోర్ స్టేడియం పనులను పూర్తిచేయాలని, కమలాపురం ఆసుపత్రిలో గైనకాలజిస్టును ఏర్పాటు చేయాలని జడ్పీటీసీ కోరారు.
- ఇన్‌చార్జ్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రజలకు అన్నివిధాలుగా మంచిచేసేందుకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను జిల్లా యంత్రాంగం పరిధిలో లేనివాటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు.
- జడ్పీ ఛైర్‌పర్సన్ జె.శారద మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించి రాష్ట్రంలోనే ఆదర్శంగా రూపొందించడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. శాఖలవారీగా అన్నిరకాల అభివృద్ధి పథకాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందేలా జిల్లా పరిషత్ అన్నిరకాల చర్యలను చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, అన్నమయ్య జిల్లా డీఆర్‌వో సత్యనారాయణ, జడ్పీ డిప్యూటీ సీఈవో మైథిలి, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఆయాశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చైతన్యరెడ్డి, వరదరాజులరెడ్డి, ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

రెండు చోట్ల బాణాసంచా దుకాణాలు

● పరిశీలించిన సబ్‌కలెక్టర్



టిప్పుసుల్తాన్ మైదానంలో బాణసంచా దుకాణాల ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లెటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో రెండు చోట్ల తాత్కాలిక బాణసంచా దుకాణాల ఏర్పాటుకు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ అనుమతించారు. బుధవారం స్థానిక మిషన్ కాంపౌండు, టిప్పుసుల్తాన్ మైదానాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీటీ కళాశాల మైదానం వర్షం వస్తే బురదమయంగా మారుతుందని బాణసంచా దుకాణాల నిర్వాహకులు చెప్పారని, అందుకే టిప్పుసుల్తాన్ మైదానం, మిషన్ కాంపౌండులో తాత్కాలిక బాణసంచా దుకాణాలకు అనుమతిచ్చామన్నారు. ఈ రెండు చోట్ల దుకాణాలకు వచ్చే ప్రజల వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించాలని, అగ్నిమాపకశాఖ నిబంధనల మేరకు దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. లైసెన్సులు పొందిన వారు మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేయాలని, లేకుంటే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ ఖాజాబీ, ఫైర్ ఆఫీసర్ శివన్న పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై మరోమారు విచారణ



విచారణ చేస్తున్న వెలుగు బీపీఎం లక్ష్మీప్రసాదరెడ్డి, సీసీలు

మదనపల్లెటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం పోతబోలు గ్రామ సంఘమిత్ర రుణాలు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై వెలుగు బీపీఎం ఆధ్వర్యంలో రెండో విడత విచారణ ప్రారంభించారు. పోతబోలు సంఘమిత్ర పుణ్యవతి సంఘాల పేరు మీద శ్రీనిధి, ఉన్నతి రుణాలు తీసుకుని దుర్వినియోగం చేశారని గ్రామస్థులు సీఎం పేషీకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గత 10 రోజుల క్రితం ఏపీడీ స్థాయి అధికారులు పోతబోలుకు వచ్చి విచారణ చేశారు. బుధవారం రెండో విడత విచారణలో భాగంగా పోతబోలు పంచాయతీ జంగంపల్లె, రెడ్డిగానిపల్లెలో మహిళా సంఘాల పేరుతో సంఘమిత్ర రుణాలు తీసుకున్న వాటిపై విచారణ ప్రారంభించారు. ఈ గ్రామంలో మొత్తం 39 మహిళా సంఘాలు వుండగా, ఇప్పటి వరకు 18 సంఘాలకు చెందిన లెక్కలు పరిశీలించామని బీపీఎం లక్ష్మీ ప్రసాదరెడ్డి తెలిపారు. ఇంకా నాలుగు రోజుల పాటు విచారణ జరిపాక, గ్రామ మహిళా సమాఖ్యతో సమావేశం నిర్వహించి, విచారణ విషయాలను సంఘాల సభ్యుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సుబ్రమణ్యం, సీసీలు శారద, పుష్పలత, లక్ష్మీ, గోపాల్, సంఘమిత్రలు పుణ్యవతి, శ్వేత పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు చేర్చడమే ధ్యేయం

● మాజీ మార్కెట్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి

వాల్మీకిపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి సంక్షేమ పథకం నిరుపేదలకు చేరడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని వాల్మీకిపురం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేసే దిశగా నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. వాల్మీకిపురం మండలంలో ప్రభుత్వం ద్వారా ఇటీవల పల్లెపండుగ కార్యక్రమాలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, పీలేరు పార్టీ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, నాయకులు పీవీ నారాయణ, చంద్రమౌళి, రాజేంద్రాచారి, శేషాద్రిరెడ్డి, రాజగోపాల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూముల రీసర్వేలో తేడాలపై గ్రామసభలు



రైతులతో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్

మదనపల్లెటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేలో తప్పులు, విస్తీర్ణం వ్యత్యాసాలపై ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణకు రెవెన్యూ అధికారులు గ్రామసభలు ప్రారంభించారు. బుధవారం మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీ పప్పిరెడ్డిపల్లె గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేష్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ భూముల యజమానుల పేర్లు, ఆర్‌వోఆర్ రికార్డుల ప్రకారం వేరొకరి పేరుమీద వున్నాయని, అంతేకాకుండా విస్తీర్ణంలో కూడా తేడాలు వున్నట్లు అర్జీలు అందజేశారు. ఈ గ్రామసభలో సర్పంచ్ శరత్‌రెడ్డి, వీఆర్వో చంద్రమోహన్, పంచాయతీ సెక్రటరి మంజుల, రైతులు పాల్గొన్నారు.

పశుగణనను పకడ్బందీగా చేపట్టాలి : ఏడీ

కురబలకోట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అఖిల భారత-21 పశుగణనను పకడ్బందీగా చేపట్టాలని పశుసంవర్ధకశాఖ ఏడీ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అంగళ్లులో కురబలకోట, బి.కొత్తకోట మండలాలకు సంబంధించిన సిబ్బంది సమావేశంలో మాట్లాడుతూ మనుషుల మాదిరిగానే పశువుల గణనను ఈ నెల 25 నుంచి 28లోగా పూర్తి చేయాలన్నారు. పశువులకు మెరుగైన సేవలు అందించడానికి పశుగణన ఎంతో కీలకమన్నారు. దీనికోసం ఇప్పటికే ఎన్యుమరేటర్లకు శిక్షణా తరగతులను నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు గ్రామాల్లోకి వెళ్లి వాటిని గణనను పూర్తి చేయాలన్నారు. అలాగే రైతులకు మంజూరు చేసిన మినీ గోకులాల్లో అవకతవకలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలా ఎవరైనా చేస్తే వారిపై చర్యలు తీసుకొంటామన్నారు.

కారు ఢీకొని రైతుకు తీవ్రగాయాలు



ములకలచెరువు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఓ రైతు తీవ్రంగా గాయపడ్డ సంఘటన బుధవారం సాయంత్రం ములకలచెరువులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని గూడుపల్లెకు చెందిన రైతు కృష్ణప్ప సొంతపనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో ములకలచెరువుకు వచ్చాడు. పెట్రోల్ బంకులో ద్విచక్రవాహనంలో పెట్రోల్ పట్టుకుని బస్టాండుకు వెళ్లేందుకు ముంబాయి - చెన్నై జాతీయ రహదారిపైకి వచ్చాడు. ఈ సమయంలో వేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రైతు తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. రైతు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అక్కడి వైద్యుల సూచనల మేరకు తిరుపతి రూయాకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు.

ఆక్రమణలపై తహశీల్దార్ విచారణ

బి.కొత్తకోట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని శీలంవారిపల్లె వద్దనున్న ఎదుర్లగుట్ట ఆక్రమణలపై బుధవారం ఇన్‌చార్జ్ తహశీల్దార్ మహమ్మద్‌అన్సారీ విచారణ చేపట్టారు. గుట్టను యంత్రాలతో చదునుచేసి కబ్జాకు యత్నిస్తున్నట్టు ఫిర్యాదులు రావడంతో నిజానిజాలను ఆరాతీశారు. ఎదుర్లగుట్టకు దిగువభాగాన పలువురు పేద రైతులకు పట్టాలిచ్చారు. దీనికి ఎగువన వున్న గుట్టను శీలంవారిపల్లెకు చెందిన ముగ్గురు వ్యక్తులు అప్పట్లో చదును చేసిన విషయం వాస్తవమేనని, దీనిపై ఆరోపణలు రావడంతో నిలిపేశారన్నారు. చదునుచేసిన వ్యక్తులుగా భావిస్తున్న వారిని పిలిపించి తహశీల్దార్ హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ వీరాంజినేయులు, వీఆర్వో రవి, సిబ్బంది వున్నారు.

మత్తు కోసం...

● యువత మాత్రలు, సొల్యూషన్‌ల వినియోగం
● రూ.10 మాత్ర రూ.300కు విక్రయం
● పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ కరువు
● ఇలాగే కొనసాగితే భవిష్యత్తు అంధకారమే

మత్తుకు యువత చిత్తవుతున్నారు. మత్తు వలయంలో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. తెలిసీ తెలియని వయసులో ఫ్యాషన్ పేరుతో.. సినిమాల్లో హీరోలు చేసే మత్తు స్టైల్స్ చూసి వాటిని అనుకరిస్తున్నారు. సరదాగా సిగరెట్లు, మద్యంతో మొదలై క్రమంగా మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారు. అందులో నుంచి బయట పడలేక బానిసలుగా మారుతున్నారు. మద్యం, గంజాయి దొరకని వారు ఇప్పుడు మత్తు కోసం నానా పాట్లు పడుతున్నారు. కొత్తగా మత్తు ట్యాబ్లెట్లను వినియోగిస్తున్నారు. సంప్రదాయ మత్తు పదార్థాలు (మద్యం, గంజాయి) అందుబాటులో లేని వారు ఇతర ప్రమాదకరమైన మత్తు పదార్థాలను వినియోగిస్తూ తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఎక్కువగా 14 నుంచి 22 సంవత్సరాల మధ్యవయస్కులే బానిసలుగా మారుతుండడం గమనార్హం. పరిస్థితి విషమించే వరకు తల్లిదండ్రులకు తెలియకపోవడంతో పలు కుటుంబాలు వేదన పడుతున్నాయి.



మత్తు కోసం యువత వాడుతున్న ట్యాబ్లెట్లు, ఇంజక్షన్లు





ట్యాబ్లెట్ వాడుతున్న యువకునికి కౌన్సెలింగ్ ఇస్తున్న వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ

కడప (క్రైం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చాలా మంది యువత మత్తు కోసం మద్యం, గంజాయిలాంటి వాటితో పాటు బోనోఫిక్స్‌లాంటి ప్రమాదకరమైన పదార్థాలను వినియోగిస్తూ అనారోగ్యం పాలవుతున్నారు. వాహనాల టైర్ల పంక్చర్లకు ఉపయోగించే సొల్యూషన్ పీలుస్తూ మత్తులో ఊగిపోతున్నారు. కడప నగరంలోని పలు ప్రాంతాల్లో యువకులు వీటికి అలవాటు పడుతున్నారు. అల్మాస్‌పేట, సాయిపేట, నకాశ్, రవీంద్రనగర్, ఖలీల్‌నగర్ వంటి ప్రాంతాల్లో యువకులు ఎక్కువ శాతం ట్యాబ్లెట్లు వినియోగిస్తున్నారు. దీంతో రూ.10లు చేసే మాత్ర రూ.300కు విక్రయాలు జరుగుతున్నాయి. మద్యం, గంజాయిలాంటి అలవాట్లే కాకుండా ఇప్పుడు ఎక్కువగా మత్తు ఎక్కించే ట్యాబ్లెట్లను వినియోగిస్తుండడం గమనార్హం. మెడికల్ స్టోర్‌లే కాదు కొన్ని సెల్‌పాయింట్లలో రూ.10 విలువ చేసే మాత్రలు రూ.300లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకునేవారు ఎక్కువయ్యారు. కడపకు చెందిన ఓ యువకుడు గల్ఫ్ నుంచి కడపకు వచ్చాడు. ఇక్కడ మత్తుకు అలవాటుపడ్డాడు. సమయానికి ట్యాబ్లెట్ అందివ్వలేదని చెప్పి మరో యువకున్ని చావబాదాడు. మత్తులో ఏం చేస్తున్నామో అనే విషయం వారికే అర్థం కాకుండా పోతోంది. కొంత మంది గొడవలకు దిగితే మరికొందరు నిషా మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు.

డాక్టరు ప్రిస్కిప్షన్లు లేకుండానే..

ప్రమాదకరమైన మత్తు ట్యాబ్లెట్లు, ఇంజక్షన్లు యువకులు తీసు కుంటున్నారు. వైద్యుల అనుమతి లేకుండానే ట్యాప్ ఫ్రీ ఈఆర్ 50, రెస్టల్ 0.5/0.25 ఎంజీ, క్లోనోట్రిల్ 0.5, ఇలాంటి మాత్రలు వినియోగిస్తున్నారు. అటు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఇటు అధికారులు యువతపై నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని సర్వనాశనం చేసుకుంటున్నారు. నూరేళ్ల జీవితాన్ని మధ్యలోనే చాలించేస్తున్నారు. మత్తుకు అలవాటు పడి అనేక అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. దీనిపై తల్లిదండ్రులు అప్రమత్తమై పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోకపోతే వారి భవిష్యత్తు అంధకారంగా మారుతుంది. ప్రభుత్వ యంత్రాంగం కూడా వీటి వినియోగంపై నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.

మహిళా ఉద్యోగులకు మౌలిక వసతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మీ

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని విభాగాల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మహిళా ఉద్యోగులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు పరిష్కరించాలని ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర ఉమెన్ కమిటీ జనరల్ సెక్రెటరీ పొన్నూరు విజయలక్ష్మీ, అసోసియేట్ చైర్‌పర్సన్ శివకుమార్‌రెడ్డిలు అన్నారు. బుధవారం రాయచోటిలోని ఎన్‌జీవో హోంలో ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ నర్సింహకుమార్ ఆధ్వర్యంలో జిల్లా ఏపీజేఏసీ ఉమెన్ కమిటీ చైర్‌పర్సన్ షేక్‌ఖాసింబీ, జనరల్ సెక్రటరీ సాలమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయలక్ష్మీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వారికి రావాల్సిన బకాయిల కోసం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వేంకటేశ్వర్లు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం శివరామిరెడ్డి మాట్లాడుతూ మహిళల ఇబ్బందులు తెలియజేయడానికి అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో షీ బాక్సులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో రాజంపేట, మదనపల్లె, రాయచోటి డివిజన్లు ఉండగా మదనపల్లె డివిజన్ కమిటీ ఎన్నికను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం కో చైర్ పర్సన్స్, జిల్లా సెక్రటరీలు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సమావేశంలో మంత్రులతో పాల్గొన్న ఎమ్మెల్యే

మదనపల్లెటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ముస్లీం మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఫోన్‌లో తెలిపారు. బుధవారం రాష్ట్ర మంత్రి మండల సమావేశం అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి బి.సి.జనార్ధన్‌రెడ్డి, మైనార్టీ శాఖ మంత్రి ఫరూఖ్ నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో మైనార్టీల సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే వివరించారు. వీటిపై విచారించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రులు చెప్పారని ఎమ్మెల్యే తెలిపారు.

'వలంటీర్ల ప్రస్తావన రాకపోవడం దారుణం'

మదనపల్లె అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బుధవారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో వలంటీర్ల సమస్యలను చర్చించకపోవడం దారుణమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ అన్నారు. బుధవారం స్థానిక సంతగేటులోని ఏఐటీయూసీ కార్యాలయంలో అనుబంధ సంస్థల సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటినా వలంటీర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఈ నెల 26న మదనపల్లెలో నిర్వహించిన వలంటీర్ల సమావేశానికి అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కోశాధికారి సలీంబాషా, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, అలవేలమ్మ, వెంకటలక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన మండల నాయకులు



లోకేశ్‌ను కలిసిన సీతప్ప

రామసముద్రం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ నేత, రాజంపేట పార్లమెంట్ కమిటీ కోశాధికారి గజ్జల సీతప్ప, మదనపల్లె నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ తనయుడు యశస్విరాజ్ బుధవారం అమరావతిలోని ఐటీ శాఖామంత్రి లోకేష్‌ను కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీతప్ప మీడియాతో మాట్లాడుతూ పార్టీకి కష్టపడిన ప్రతి నాయకుడికి, కార్యకర్తలకు పార్టీలో గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారని సీతప్ప తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న రాజకీయ, ప్రజా సమస్యలను లోకేశ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పీలేరు విద్యార్థినులు



పీలేరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు జి.అక్షయ, ఎస్.హర్షిత అండర్-17 ఖో-ఖో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీలేరులోని మహాత్మా జ్యోతీరావు పూలే బీసీ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వి.రాధారాణి తెలిపారు. నవంబరు 2 నుంచి 4వ తేది వరకు విశాఖ జిల్లా అనకాపల్లెలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు తరపున వారు పాల్గొంటారని తెలిపారు. బుధవారం గురుకులంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాల్ పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని మహిళ మృతి

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉరివేసుకుని మహిళ మృతి చెందిన సంఘటన మదనపల్లె మండలం, కోళ్లబైలు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని కోళ్లబైలు గ్రామం జగన్ కాలనీలో నివాసం ఉండే దేవరాజుల భార్య యనమల స్వాతి (37) ఇంట్లో చీరతో ఉరివేసుకుని మృతి చెందిందని, వైవాహిక జీవితంతో మనస్పర్థల కారణంగా భర్త నుంచి 10 ఏళ్ల క్రితం విడిపోయినట్లు తెలిపారు. ఈమెకు ఇరువురు కుమారులు ఉన్నారని, తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళపై కొడవలితో దాడి

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపల్లెలో బుధవారం ఓ మహిళ మరో మహిళను కొడవలితో దాడి చేసి గాయపర్చిన సంఘటన వెలుగులోకి వచ్చింది. తాలుకా పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని వేంపల్లె గ్రామానికి చెందిన నారాయణ భార్య రమణమ్మ (60)ను అదే గ్రామానికి చెందిన శ్రీదేవి తలపై కొడవలితో నాలుగు చోట్ల నరికి గాయపర్చింది. వీరిరువురికి పొలం పనుల విషయమై ఘర్షణ ఏర్పడినట్లు తెలిసింది. బంధువుల ఫిర్యాదు మేరకు సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. రమణమ్మను చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

'పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం'

కురబలకోట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని నియోజకవర్గ నేత జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కంటేవారిపల్లె సమీపంలో నిర్మించిన చింతపండు ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఆర్థికంగా చేయూతనివ్వడానికి ఈ ప్రాసెసింగ్ యూనిట్‌ను మంజూరు చేసిందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. చింతపండును ఉపయోగించి అనేక రకాల ఉత్పత్తులను తయారీ చేసి వాటికి మార్కెటింగ్ సౌకర్యాన్ని మరింతగా కల్పించనున్నట్లు తెలిపారు. మరిన్ని పరిశ్రమలను నియోజకవర్గానికి తీసుకొచ్చి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె నియోజకవర్గ సమన్వయకర్త మల్లికార్జుననాయుడు, నాయకులు అయూబ్‌బాష, రాఘవరెడ్డి, బాలకృష్ణ, సురేష్, సూరి, వెంకటరమణారెడ్డి, ఎల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

యువకుడికి తీవ్రగాయాలు

కురబలకోట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కొత్తపల్లెకు చెందిన వెంకటేష్(30) తన వాహనంలో తంబళ్లపల్లెకు సొంతపనుల నిమిత్తం వెళ్లి అక్కడ పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలోని తూపల్లె వద్ద గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. గాయపడ్డ యువకుడిని 108 సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. యువకుడి పరిస్థితి ఆందోళకరంగా ఉండటంతో తిరుపతికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల నుంచి అర్జీల వెల్లువ

నిమ్మనపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తవళం గ్రామ పంచాయతీలో గురువారం రీసర్వే ద్వారా జరిగిన పట్టాదారు పాసుపుస్తకాల తప్పులపై గురువారం తహసీల్దార్ ధనంజేయులు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సభల్లో రైతులు పెద్ద ఎత్తున ఫిర్యాదులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామ్‌ప్రసాద్, సిబ్బంది సిరాజ్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.



అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఏర్పాటైన సత్య ఏజెన్సీస్ వారి 39వ షోరూంను బుధవారం రిబ్బన్ కత్తిరించి లాంఛనంగా ప్రారంభిస్తున్న ఆ భవన యజమాని ఎం అశోక్‌కుమార్.. ఈ కార్యక్రమంలో సత్య ఏజెన్సీస్ ప్రతినిధి సత్యరాజ్, ప్రముఖ బ్రాండ్ల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

నేడు డీలర్ల జిల్లా సర్వసభ్య సమావేశం

మదనపల్లె అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం గురువారం మదనపల్లెలోని సీఎస్ఐ ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్నట్లు జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ది మదనపల్లె ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్స్ సమస్యలపై చర్చించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ సమావేశానికి మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, డీలర్ల రాష్ట్ర అధ్యక్షుడు డీవీ లీలామాధవరావు, తంబళ్లపల్లె ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి, స్టేట్ సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ ఎస్ఎం పర్వీన్‌తాజ్ హాజరవుతారన్నారు. జిల్లాలోని రేషన్ డీలర్లు అధిక సంఖ్యలో సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వీధికుక్కలతో హడల్

- బయటకెళ్లాలంటే వణుకు
- ఇప్పటికే గొర్రెలు, మేకల మందపై దాడి



పీటీఎం ప్రధాన రహదారిలో తిరుగుతున్న వీధి కుక్కల గుంపు

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారుల్లో వీధికుక్కలతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. పట్టణంలో ఒక్క ప్రాంతమని కాకుండా ఏ వీధుల్లో చూసినా వీధి కుక్కలు దర్శనం ఇస్తుండడంతో స్థానికులు బెంబేలెత్తి పోతున్నారు. గ్రామాల్లో ఇబ్బడి ముబ్బడిగా వీధి కుక్కలు అదిక సంఖ్యలో పెరిగిపోవడంతో వాటి సంతతిని చూసి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో మహిళలు, చిన్న పిల్లలు ఒంటరిగా దుకాణాలకు వెళ్లాలంటే హడలి పోతున్నారు. పట్టణంలో చికెన్ దుకాణాలు ఎక్కడ పడితే అక్కడ ఉండడంతో ఆ వీధి కుక్కలకు తినేందుకు ఆహారం పుష్కలంగా లభిస్తుండడంతో వాటి సంఖ్య భారీగా పెరిగి పోయింది. పట్టణంలో వీధి కుక్కలు ప్రధాన రోడ్ల కూడళ్లల్లో మందలు మందలుగా ఒకే చోటకు చేరి ఉండడంతో ఏ సమయంలో వీధి కుక్కలు మీద పడి దాడి చేస్తాయోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వీధి కుక్కలు మనుషలను చూస్తే భయపడాల్సింది పోయి.. మనుషులు వీధి కుక్కలను చూసి భయపడాల్సి వస్తోంది. దీంతో పాటు గ్రామాల్లో వీధి కుక్కలు గొర్రెలు, మేకల మందలపై దాడి చేసి గాయపర్చిన సంఘటనలు కోకొల్లలు. కనీసం ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఆరుగురు వీఆర్వోల రిలీవ్

బి.కొత్తకోట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సిబ్బంది బదిలీల్లో భాగంగా బి.కొత్తకోట మండలం నుంచి బదిలీ అయిన ఆరుగురు వీఆర్వోలు బుధవారం రిలీవ్ అయ్యారు. హార్సిలీహిల్స్ పరిధిలోకి వచ్చే కోటావూరు వీఆర్వో నరేంద్రకుమార్ పీటీఎం మండలంలోని మల్లెల గ్రామానికి, అమరనారాయణ టి.సదుంకు, హైదర్‌షా తుమ్మరకుంటకు, వెంకటేష్ పులికల్లుకు బదిలీ అయ్యారు. కాగా తుమ్మణంగుట్ట వీఆర్వోగా వున్న సంధ్య మదనపల్లె టౌన్‌కు, సోమశేఖర్ తంబళ్లపల్లె మండలంలోని రేణుమాకులపల్లెకు బదిలీపై వెళ్లారు. కాగా వీరి స్థానంలో ఆరుగురు బయటి మండలాల నుంచి బి.కొత్తకోట మండలంలో విధుల్లో చేరనున్నట్లు ఇన్‌చార్జ్ తహశీల్దార్ మహమ్మద్‌అన్సారీ తెలిపారు.

మెనూ మేరకు భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో త్యాగరాజు

తంబళ్లపల్లె, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ మేరకు భోజనాన్ని అందించాలని ఎంఈవో త్యాగరాజు సూచించారు. బుధవారం తంబళ్లపల్లె మోడల్ స్కూల్ లో మధ్యాహ్న భోజనాన్ని అకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన రికార్డులతో పాటు విద్యార్థుల హాజరును పరిశీలించి బోధన విధానంపై ఆరా తీశారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ హేమంత్‌కుమార్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న జయచంద్రారెడ్డి

ములకలచెరువు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో బుధవారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. బి.కొత్తకోటకు చెందిన మహబూబ్‌బాషా అనారోగ్యంతో పలు ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించుకున్నాడు. దీంతో ఆయన వైద్యం కోసమైన నగదు కోసం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ద్వారా సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో సీఎంఆర్ఎఫ్ నుంచి బాధితుడికి రూ.1,98,505 మంజూరు చేస్తూ చెక్కును పంపగా, దాన్ని జయచంద్రారెడ్డి బాధితుడికి అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలు

తంబళ్లపల్లె, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు... గోపిదిన్నె పంచాయతీ కొత్తపల్లెకు చెందిన నరసింహారెడ్డి(65), చిన్న నరసింహారెడ్డి(82) ద్విచక్ర వాహనంలో ఉప్పులూరువాండ్లపల్లెకు వెళ్తుండగా గోపిదిన్నె క్రాస్ వద్ద తంబళ్లపల్లె నుంచి బండ్రేవుకు వెళ్తున్న ఆటో వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసింహారెడ్డి, చిన్న నరసింహారెడ్డిలు తీవ్రంగా గాయపడగా స్థానికులు ప్రైవేటు వాహనంలో తంబళ్లపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కొరకు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.

మత్తుకు అలవాటు పడితే అంతే..

- డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కేశవరెడ్డి

మదనపల్లెటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నేటి యువత మత్తుకు అలవాటు పడితే వారి భవిష్యత్ చిత్తవుతుందని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కేశవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కృష్ణచైతన్య నర్సింగ్, ఫార్మసి కళాశాలలో మత్తు పదార్థాలు, డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటు పడిన వారు చేతిలో ఫోన్ లేకపోయినా వున్నట్లు, గదిలో కిటికీలు లేకపోయినా వున్నట్లు ఫీల్ అవుతారన్నారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలు ఉద్రేకం కలిగిస్తాయని, దీని వలన నేరాలకు పాల్పడి చాలా మంది జైలుకు వెళ్లారని గుర్తు చేశారు. కొంత మంది ముంచుకొస్తున్న ప్రమాదం గుర్తించక ప్రాణాలు వదిలారని పీలేరులో రైలు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మృతి చెందడాన్ని ఉదహరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి, కరస్పాండెంట్ రామ్మోహన్‌రెడ్డి, డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి, ప్రిన్సిపాల్ పి.వసంతకుమార్, డాక్టర్ సుమన్, నెహ్రూ యువకేంద్ర, గ్రామజ్యోతి సొసైటీ అధ్యక్షురాలు సుభద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పీలేరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): డిపో పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పీలేరు డీఎం బండ్లకుమార్ తెలిపారు. గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, ఆర్టీసీ సర్వీసులు, ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు తగిన సలహాలు, సూచనలు తెలియజేయాలనుకునే వారు 9959225679 నెంబరకు ఫోను చేయాలని ఆయన తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

పీలేరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ) పనుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో వచ్చే వారం రోజులపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీ ట్రాన్స్‌కో ఏఈ(ఆపరేషన్స్) ఖాదర్ ఇలాహీ తెలిపారు. గురువారం నుంచి స్థానిక అజంతా మిట్ట, అయ్యప్ప రెడ్డి కాలనీ, ఇందిరానగర్, రైల్వేగేటు ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన వివరించారు. అభివృద్ధి పనుల కారణంగా ఏర్పడుతున్న ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.